నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
శుక్రవారం | 04 అక్టోబర్ 2024 | www.navatelangana.com

ఇందిరా పార్కు వద్ద త్రిబుల్ ఆర్ రైతులు నిరసన



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల త్రిబుల్ ఆర్ రింగు రోడ్డు రైతులు హైద్రాబాద్ లోని ఇందిరా పార్కు దర్నాచౌక్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు.మర్కుక్ మండలంలోని పరిదిలో పాతూరు,ఇప్పల గూడెం,చేబర్తి, అంగడికిష్టాపూర్, నర్సన్నపేట రైతుల భూమి 209 ఎకరాల భూమిని సేకరించనున్నారు .చేబర్తి రెవెన్యూ పరిధిలోని గ్రామాలలో 134 ఎకరాల భూమి సేకరించనున్నారు. ఈ రోడ్డు ఎక్కువగా చిన్న,సన్న కారు రైతుల భూములు పోవడంతో అందోళన చెందుతున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఉన్న ఎకరం,అర ఎకరం భూమిలో తాత,ముత్తాల నుండి వ్యవసాయం చేసుకుని బతుకు బండిని లాగిస్తున్నామని అవేదన వ్యక్తం చేశారు, ఉన్న భూమి త్రిబుల్ ఆర్ రింగు రోడ్డు రూపంలో భూములను మింగేస్తుంటే మేం బతుకేదేలని అవేదన చెందుతున్నారు.రీజనల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ మార్చాలని రైతులు డిమాండ్ చేశారు.ప్రాణలైన ఇస్తాం కాని భూమిని మాత్రం ఇచ్చేది లేదని రైతులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో చేబర్తి, నర్సన్నపేట ,తదితర గ్రామాల రైతులు ఉన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి



-తల్లితోపాటు బీడీల కార్ఖానాకు వెళ్లిన సమయంలో జరిగిన ఘటన.
-పాము కాటు వేసిన విషయాన్ని ఆలస్యంగా గుర్తించడంతో పోయిన ప్రాణం

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

పాముకాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తుమ్మల శ్రీను కుమారుడు మనీష్ (8) గ్రామంలోని స్కూల్లో మూడవ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు రావడంతో ఇంటి వద్ద తల్లితో ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం బీడీలను మునీంకు ఇచ్చేందుకు తల్లితో వెంట వెళ్లిన అతను బీడీలు కాడా నా సమీపంలోని అట్టలతో ఆడుతుండగా అతడిని పాము కాటు వేసింది. కాగా కాటు వేసిన విషయాన్ని అతడు గమనించకపోవడం, తల్లికి ఏదో పురుగు కరిచిందని చెప్పడంతో ఆమె పట్టించుకోలేదు. కొద్దిసేపు తర్వాత అతడు నురగలు కక్కుతూ ఇంట్లో పడిపోవడంతో గమనించిన గ్రామస్తులు, అట్టలను తీసి చూడగా అక్కడ రెండు పాములు కనిపించడంతో, వాటిని చంపి, బాలుడిని హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించినప్పటికీ అప్పటికే బాలుడు చనిపోయాడు.

ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా విస్తృత ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- ఈ నెల 9న ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేత
- గడువు లోపు ధ్రువపత్రాల పరిశీలనను పూర్తి చేయాలని ఆదేశం









నవతెలంగాణ-సంగారెడ్డి

ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలె త్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహన్ తదితరులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ధాన్యం సేకరణ, ఉపాధ్యాయుల నియామక ప్రక్రి యలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.ధాన్యం సేకరణను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తూ, ఏ చిన్న పొరపాటుకు సైతం ఆస్కారం ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీ.ఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 60.73 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ధాన్యం సాగు చేసినందున పెద్ద ఎత్తున దిగుబడులు చేతికందే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సుమారు 7 వేల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అవసరమైన పక్షంలో మరిన్ని కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఈసారి దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలకు వేర్వేరు గా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు, సన్న రకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 500 చొప్పున బోనస్ అందించనుంది తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో వారి ఖాతాలలో బిల్లులకు సంబంధించిన డబ్బులు జమ అయ్యేలా చూడా లన్నారు. ఏ ఒక్క కొనుగోలు కేంద్రం కూడా అర్ధాంతరంగా మూతబడకుండా, రైతుల నుండి చివరి ధాన్యం గింజను సైతం కొనుగోలు చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిం చాలని, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని హితవు పలికారు. రాష్ట్రంలో డీఎస్సీ-2024 ద్వారా 11062 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో, విజయదశమి పండుగకు ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి సూచించారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యా యులకు ఈ నెల 9న హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో నియామక పత్రాలు అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, డీఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం కొండలరావు, మార్కెటింగ్ శాఖ అధికారులు , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా మెదక్ జిల్లా నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, డి ఎం సివిల్ సప్లై హరికృష్ణలు పాల్గొనగా, సిద్దిపేట జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, కమిషనర్ పోలీస్ డాక్టర్ అనురాధ, అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

పేటలో ఫ్యామిలీ డిజిటల్ హెల్త్‌కార్డ్ సర్వే



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలో తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ హెల్త్‌కార్డ్ సర్వేను మున్సిపల్ కమిషనర్ జే.ఉమా ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మున్సిపల్ పరిధిలో 26వ వార్డులో మున్సిపల్ సిబ్బంది రెండు టీంలతో ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి తరలిన నల్తూరు రామభక్తులు



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని నల్తూరు గ్రామానికి చెందిన శ్రీరామ భక్తజన మండలి ఆధ్వర్యంలో భజన భక్తులను మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ప్రత్యేకంగా బస్సు సదుపాయం కల్పించి భద్రాచల రామయ్య దర్శనానికి పంపించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీకి భక్త బృందం కృతజ్ఞతలు తెలిపింది.

రోజురోజుకు రెడీమేడ్‌పై పెరుగుతున్న క్రేజ్

వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు అల్లాడి వీరేశం గుప్తా



నవతెలంగాణ-జహీరాబాద్

రోజు రోజుకు రెడీమేడ్ వస్త్రాలపై యువతకు క్రేజ్ పెరుగుతుందని వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు అల్లాడి వీరేశం గుప్తా అన్నారు. ఎస్‌వి షాపింగ్ మాల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేడు వస్త్ర రంగంపై ఎంతోమంది జీవనోపాధి కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆ విధమైన వస్త్ర వ్యాపారం తమ కుటుంబం నిర్వహించడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వాలు వస్త్ర వ్యాపారులకు సబ్సిడీలు కేటాయించి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఒక నూతన వస్త్ర వ్యాపార దుకాణం వస్తే అందులో వందల మంది ఉపాధి పొందడంతో పాటు అనుబంధంగా టైలర్లు వివిధ రకాల డిజైనర్స్ కుటుంబాలు కూడా కొనసాగుతాయన్నారు . ప్రభుత్వం వివిధ రకాల టాక్సు వేయడంతో బట్టల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. కొన్ని పన్నులు తగ్గిస్తే సామాన్య ప్రజలకు సైతం ఇంకా ఫ్యాషన్ డిజైనింగ్‌కు సంబంధించిన బట్టలు అందుబాటు ధరల్లోకి లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, రంజోల్ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, అల్లాడి వంశీ, అల్లాడి సాయిరాం, అనిల్ జాజు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపిఆర్ గ్రాండియోలో బతుకమ్మ సంబురాలు

ప్రకృతిని ఆరాధించే అతి పెద్ద పండుగ బతుకమ్మ పండుగ



నవతెలంగాణ-పటాన్ చెరు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయంలో భాగంగా దసరా పండుగకు ముందు బతుకమ్మ వేడుకలను ఊరూరా, వాడవాడల్లోనూ సంభురంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. పటాన్‌చెరులోని ఏపిఆర్ గ్రాండియో గృహసముదాయంలో అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు ఏపిఆర్ గ్రాండియో కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపారు. భాద్రపద అమావాస్య నుంచి ఆశ్వీయుజ శుద్ధ నవమి వరకు పండుగను ఎంతో సంబరంగా చేసుకుంటారు. ప్రకృతిని ఆధారం చేసుకుని భక్తి పారవశ్యంతో బతుకమ్మ తల్లిని కొలుస్తారు. ప్రకృతి అందాలను చాటి చెప్పే పండుగ ఇది.పూలతో దేవతలను అర్చించడం సహజం. కానీ పూవులనే దేవతగా సంభావించడం బతుకమ్మ పండుగలోని ప్రత్యేకత. పూవులను గౌరీదేవిలా ఆరాధిస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణాల్లోనో, మైదానాల్లోనో, ఇళ్ల ముంగిట్లో బతుకమ్మను ఉంచి చుట్టూ తిరుగుతూ 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో లాంటి పాటలతో ఆనందంగా అమ్మవారిని పూజించడం మన సంస్కృతి ప్రత్యేకత ఆటపాటలతో, సంప్రదాయ నృత్యాలతో ఐకమత్యంతో మన సంస్కృతీ సంప్రదాయాలను సంఘటితం చేయడానికి ఏపిఆర్ గ్రాండియో కల్చరల్ కమిటీ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయం.

చందు కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ మంత్రి హరీష్ రావు



నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య భర్త చందు మృతి చెందడం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు అన్నారు. గురువారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి చందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ చందును రక్షించేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పలు దఫాలుగా వివిధ వైద్యశాలల వైద్యులతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. అయినా ఆయన ఆరోగ్యం సహకరించకపోవడంతో అతి చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమైన విషయమన్నారు. చందు భార్య మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. అధైర్య పడాల్సిన అవసరం లేదని, పార్టీ ఒక కుటుంబం లాంటిదన్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా స్థానిక శాసనసభ్యునికిగాని లేదా నేరుగా తనకు కూడా ఫోన్ చేసి మాట్లాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్యరావు, చింత ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్, దేవి ప్రసాద్, మాజీ వైస్ చైర్మన్‌లు అశోక్ సేరి, మహమ్మద్ తంజీం, మాజీ కౌన్సిలర్లు నామ రవి కిరణ్, అబ్దుల్లాలు, చందు తండ్రి నరసింహులు, అన్న శివ, కుమారుడు మురళీకృష్ణలకు ఓదార్చారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షునిగా మానయ్య ఎన్నిక

అభినందనలు తెలిపిన జోగిపేట నాయకులు

నవతెలంగాణ-జోగిపేట : పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యవర్గ ఎన్నికల్లో జోగుపేటకు చెందిన ఆకుల మానయ్య తోపాటు ఆయన ప్యానెల్ ఘన విజయం సాధించింది. గురువారం రాత్రి వరకు సంగారెడ్డిలో జరిగిన ఎన్నికలలో విజయ దుందిబి మోగించారు. జిల్లాలోని పీఆర్‌టీయూ నాయకులతోపాటు జోగిపేట 17వ వార్డు కౌన్సిలర్, సోదరుడు ఆకుల చిట్టిబాబు ఘనంగా సన్మానించారు.



యువకుడిపై కత్తితో దాడి

నవతెలంగాణ-బెజ్జంకి

ఆర్థిక లావాదేవిల్లో మనస్పర్ధలు తలెత్తి యువకుడిపై పలువురు కత్తితో దాడి గాయపర్చిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సోమని ప్రవీణ్ ఉపాధి కోసం కోరుట్లలో నివాసముంటున్నాడు. ప్రవీణ్ తన స్వంత కారులో గురువారం ఉదయం కోరుట్ల నుంచి హైదరాబాద్ వెళుండగా మార్గమధ్యలో మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారు యందు రాజీవ్ రహదారిపై సోమని ప్రవీణ్ వెళ్తున్న కారును బెజ్జంకి గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్, వేల్పుల శ్రీకాంత్, చందు పలువురు కలిసి అడ్డగించి కత్తితో దాడి చేసి గాయపర్చారు. గాయపడిన బాధితుడిని మెరుగ్గైన చికిత్సకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ క్రిష్టా రెడ్డి తెలిపారు. ఇరువురి మద్య ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో గొడవలు తలెత్తాయని బాధితుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాపార రంగంలో అల్లాడి కుటుంబం దిట్ట

- ఎంపీ సురేష్ కుమార్ షట్కాం
- సినీతార రాశిఖన్నా ఎస్‌వీ మాల్ ప్రారంభోత్సవం లో సందడి





నవతెలంగాణ-జహీరాబాద్

వస్త్ర వ్యాపార రంగంలో అల్లాడి కుటుంబం ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో అల్లాడి జార్జి కుటుంబాలు కలసి నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వి షాపింగ్ మాల్‌లో రెడీమేడ్ విభాగాన్ని సినీ తారా రాశిఖన్నా గురువారం ప్రారంభించారు. ముందుగా బర్దిపూర్ ఆశ్రమ పిఠాధిపతి అవదూతగిరి మహారాజ్ జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడు తూ.. గత 50 ఏండ్ల నుంచి అల్లాడి కుటుంబం ఉమ్మడి జిల్లాలోనే జహీరాబాద్‌లో అతిపెద్ద షాపింగ్ మాల్‌ను నిర్వహిసున్నట్లు గుర్తు చేశారు. కర్నాటక, మహారాష్ట్ర నుంచి ఎడ్ల బండిలో వచ్చి ఇక్కడ బట్టలను కొనుకునే వాళ్ల అని అన్నారు. అలాంటి స్థితి నుంచి అల్లాడి కుటుంబం వస్త్ర ప్రపంచంలో దినదినాభివృద్ధి చెందుతూ నేడు జార్జి కుటు ంబంతో కలిసి నూతనంగా ప్రపంచ స్థాయి వస్త్ర వ్యాపార మాలలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ మాట ్లాడుతూ.. అల్లాడి కుటుంబానికి రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్లో కూడా గతంలో మంచి పేరు ఉండేదన్నారు. తెలంగాణ ఆంధ్రాలోనే కాకుండా కర్నాటక, మహారాష్ట్రలో వారి వ్యాపారం బ్రాంచ్లు అభివృద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, టీఎస్ ఐడీసీ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు పాటిల్, రాములు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, రామలింగారెడ్డి, మహమ్మద్ మక్సూద్, అశోక్ అప్పారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మహంకాల్ శుభాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు..

ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ శివకుమార్ లతో కలసి అల్లాడి, జాజు కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. షాపింగ్ మాల్‌లో పర్యటించి పలు విభాగాలను పరిశీలించారు.

అనంతరం అల్లాడి కుటుంబ సభ్యులు వీరేశం గుప్తా, నర్సింలు గుప్త, అనిల్‌జాజు, అల్లాడి వంశీ, అల్లాడి సాయిరా ంలు అతిథులకుపూలమాలలు శాలువాలతో సన్మానించారు.

శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ బీబీ పాటిల్..

ఎస్ వి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ బీబీ పాటిల్ తన అనుచ రులతో షాపింగ్ మాల్‌ను సందర్శించి అల్లాడి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జైపాల్ రెడ్డి, భాస్కర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

కాజిపల్లిలో వైద్య శిబిరం



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన కాజీపల్లి పంచాయతీ కార్యాలయ సమీపంలో ఆర్కే ఫౌండేషన్ ఆర్‌విఎం ఆసుపత్రి సంయుక్త సౌజన్యంతో గురువారం ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపుగా 300 మంది రోగులకు చికిత్సలు నిర్వహించి సలహాలు సూచనలతోపాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ శిబిరంలో కంటి, సాధారణ వ్యాధులు,కీళ్ల నొప్పులు, గుండె పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ టెస్టులు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు ఆర్కే ఫౌండేషన్ చైర్మెన్ దండే రమాకాంత్ బృందం తెలిపారు. అలాగే నేడు స్థానిక 181 జీఎంఆర్ కాలనీలో మరో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ బృందం తెలిపారు.

ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవాల ఆహ్వానం పత్రిక అందజేత



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల గ్రామ పరిధిలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం అందజేశారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి 08 వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో నూతన దేవాలయాన్ని నిర్మించి శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట, తదితర పూజా కార్యక్రమాల వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చిమ్ముల దేవేందర్ రెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఉత్తమ అవార్డులు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

పురపాలక సంఘం నిర్వహించిన పలు స్వచ్ఛత కార్యక్రమాల్లో క్రమశిక్షణగా పనిచేసిన కార్మికులకు, అత్యుత్తమ ప్రదర్శన చేసిన మున్సిపల్ కార్మికులకు మునిసిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కర్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమీషనర్ జే జెగ్జీవన్ గురువారం అవార్డులను అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో యం.యం. కోర్ట్ కాలనీలో మాస్ క్లినెస్, ప్లాంటేషన్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ వివేకానంద, మజీద్, రాజేష్, రామకృష్ణ, సానిటేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్స్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్క అడ్డురావడంతో కూలీల ఆటో బోల్తా

పలువురికి గాయాలు




నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మండలంలోని అబ్బేంద పీర్లతండాకు చెందిన పలువురు కూలీలు కూలి పనుల కోసం ఆటోలో కర్ణాటక వెళ్తుండగా.. సక్రు నాయక్‌తాండా వద్ద కుక్కలు అడ్డురావాడంతో ఆటో బోల్తా పండింది. దాంతో పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రాకేష్ షేట్కార్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఆయనతోపాటు శివకాంత్ పటేల్, సంతోష్ పటేల్, దిశ కమిటీ సభ్యులు ప్రకాశ్‌రాథోడ్, యూత్‌కాంగ్రెస్ నాయకులు సోఫి రహిమాన్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపులో పంచాయతీకి ఎలాంటి సంబంధం లేదు

నిరాధారణ ఆరోపణలు
ఇంద్రేశం పంచాయతీ కార్యదర్శి సుభాష్




నవతెలంగాణ-పటాన్‌చెరు

ఇంద్రేశం గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల ఓ ఫ్లెక్సీ తొలగింపులో గ్రామ పంచాయతీకి ఎలాంటి సంబంధం లేదని ఇంద్రేశం పంచాయతీ కార్యదర్శి సుభాష్ స్పష్టం చేశారు. గురువారం పంచాయితీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంద్రేశం గ్రామపంచాయతీ పరిధిలోని ఎంట్రెన్స్‌లో ఒక సంస్థ పంచాయతీ పర్మిషన్‌తో ఒక ఆర్చి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ ఆర్చి పైన గ్రామానికి చెందిన నాయకులు బండి హరి శంకర్ ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ ఫ్లెక్సీ గురించి గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఫ్లెక్సీ పెట్టడానికి అనుమతి తీసుకున్నారా అని తనను అడిగారని తెలిపారు. ఆర్చి పైన ఫ్లెక్సీ పెట్టిన విషయమై మీ అనుమతి తీసుకొని పెట్టారా అని యజమానికి వివరణ కోరగా, తమకు తెలియకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారన్నారు. ఆ ఫ్లెక్సీని తొలగిస్తామని సదరు యజమాని తెలిపారన్నారు. ఐదు రోజుల తర్వాత ఏర్పాటు చేసిన ఫ్లెక్సిని తొలగించారని చెప్పారు. ఆర్చి యజమానికి తెలియకుండా బండి హరీశంకర్ ఫ్లెక్సీ పెట్టినట్లు, ఇతనికి తెలియకుండా ఆర్చి యజమాని ఫ్లెక్సీని తొలగించడం జరిగిందన్నారు. ఈ ఫ్లెక్సీ తొలగింపులో తన ప్రమేయంకాని, గ్రామపంచాయతీ సిబ్బంది ప్రమేయం కాని లేదన్నారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే గతంలో నోటీసులు ఇచ్చి కూల్చి వేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇక మీదట కూడా అక్రమ నిర్మాణాలు చేపడితే నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడంగాని, వత్తాసు పలకడంగాని చేయడం లేదని తెలిపారు.

కళాత్మకతకు సాంకేతికతను జోడించండి

స్కెచింగ్ కార్యశాలలో ఆర్కిటెక్చర్ విద్యార్థులకు శిక్షకుల సూచన



నవతెలంగాణ-పటాన్ చెరు

ఆర్కిటెక్చర్ విద్యార్థులలో నిబిడీకృతంగా ఉన్న కళాత్మకతకు సాంకేతికతను జోడిస్తే అటు ఖచ్చితత్వాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, ఇటు వారి సృజనాత్మక ఆలోచనలను మరింత పెంపొందించుకోవచ్చని శిక్షకురాలు సానియా షర్ఫున్నీసా అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో రెండు రోజుల స్కెచింగ్ కార్యశాలను నిర్వహించారు. ఆర్కిటెక్చరల్ డిజైన్ రంగంలో కీలకమైన దృక్పథం, షేడింగ్, నిష్పత్తులతో సహా అవసరమైన స్కెచింగ్ టెక్నిక్‌లపై లోతైన అవగాహన ఈ వర్క్‌షాప్‌లో కల్పించారు. సాధారణమైన వాటిని సంక్లిష్టమైన, ఆకర్షణీయమైన స్కెచ్‌లుగా మార్చడం, ప్రాదేశిక సంబంధాలను వాళ్ళు దృశ్యమానం చేయగల వారి సామర్థ్యాన్ని, క్రియాత్మక, సౌందర్యపరంగా ఆహ్లాదకరమైన భవనాలను రూపొందించడంలో నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఇందులో పాల్గొన్నవారు సాధన చేశారు. హాచింగ్, షేడింగ్ వంటి సాంకేతికతలను కూడా ఈ సందర్భంగా వారికి వివరించారు. ఈ కార్యశాలలో నిర్వహించిన ముఖాముఖిలో విద్యార్థుల మధ్య చిట్కాలు, సాంకేతికతల మార్పిడిని ప్రోత్సహించారు. కార్యశాల ముగిసే సమయానికి విద్యార్థులు తమ డ్రాయింగ్‌లో ఖచ్చితత్వాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, వారి సృజనాత్మక ఆలోచనలను మెరుగుపరచుకున్నారనడంలో అతిశయోక్తి లేదు.

నాటు బాంబులు, వణ్యప్రాణుల వేటాడుతున్న ముఠా సభ్యుల అరెస్టు

- హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీనివాస్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

నాటు బాంబులను తయారు చేస్తున్న వ్యక్తితోపాటు జంతువులు, వణ్యప్రాణులను వేటాడుతున్న వేటగాళ్ళ ముఠాను పట్టుకుని ఐదుగురి వ్యక్తులను రిమాండ్‌కి తరలించినట్లు హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీను తెలిపారు. హుస్నాబాద్ సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత కొన్ని రోజుల క్రితం మీర్జపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు గుట్ట పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రాల వద్ద జంతువులు, వన్యప్రాణులు కోసం నాటు బాంబులు పెట్టారని తెలిపారు. ప్రమాదవశాత్తు ఆ బాంబు పేలి అదే గ్రామానికి చెందిన ఎం.డి.ఖలిం వ్రేళ్ళకు తీవ్ర గాయాలు కాగా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. బాధితుడు అన్న తాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. మీర్జాపూర్ గ్రామంలోనీ ఓ ఇంటిలో నాటు బాంబులు ఉన్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లడంతో నాటు బాంబులు దొరికాయని తెలిపారు. నాటు బాంబులు తయారు చేస్తున్న పిట్టల స్వామి, బధనపురం తిరుపతి అలియాస్ ఎరుకల తిరుపతి, కందుకూరి భాస్కర్ అలియాస్ కమ్మరి భాస్కర్, ఇటిక్యాల సతీష్, శ్రీమంతుల శీనులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వన్యప్రాణులను జంతువులను వేటాడేందుకు నాటు బాంబులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీను హెచ్చరించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్, కానిస్టేబుల్స్ నరేష్, రాజు, శేఖర్, తదితరులున్నారు.

2
నవతెలంగాణ
సంగారెడ్డి
శుక్రవారం | 04 అక్టోబర్ 2024 | www.navatelangana.com

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని నీలం మధుకు ఆహ్వానం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాల్టీ పరిధిలో దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గామాత పూజ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర నాయకులు, మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాండేట్ నీలం మధు ముదిరాజుకు 'మా అంబి మహిళా సేవా సమితి' తరపున రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు తప్పకుండా హాజరై అమ్మవారిని దర్శించుకుంటానని నీలం మధు ముదిరాజ్ కమిటీ సభ్యులకు తెలిపా రు. కార్యక్రమంలో మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు దినసాథ్, రాజారామ్, శ్రీమన్నారాయణ, లక్కన్, ఉద్యానంద్, తివారీ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు చేతుల మీదుగా వాటర్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల చిన్న నూతనంగా ఏర్పాటు చేసిన వండర్ వాష్ వెహికల్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, సీనియర్ నాయకులు దేవి ప్రసాద్, కాసాల బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, నరహరి రెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లు, నర్సింలు, శ్రవణ్ రెడ్డి, జలంధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దిగంబర్ రెడ్డి బ్రహ్మానంద రెడ్డి, రాజు తాజా మాజీ సర్పంచ్ లు, సిద్ధారెడ్డి, అశోక్ రెడ్డి, రాధా కిషన్ సెట్, సంతోష్ సెట్, ఆకాశ్ పాటిల్, శ్రీకాంత్ రెడ్డి,రఘుపతి రెడ్డి, అశోక్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ..

అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి పంపిణీ చేశారు.



ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో కౌన్సిలర్ దంపతులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని మల్లన్న బస్తీలో బుధవారం జరిగిన ఎంగిలపూల బతుకమ్మ వేడుకల్లో కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, స్వప్న అనిత, స్వరూప, సునీత, రాణి, ప్రత్యూష, అనుష, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీలో సత్తా చాటిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-జోగిపేట

ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో జోగిపేట స్వామి వివేకానంద జూనియర్ కళాశాలలో చదువుకున్న మెదక్ జిల్లా చిలిపిచేడు మండలం రహీంగూడకు చెందిన విద్యార్థి జూల లింగం సత్తా చాటారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్‌జిటి విభాగంలో జిల్లాస్థాయి మొదటి ర్యాంక్ సాధించారు. దాంతో కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ కే.రాజు రెడ్డి, కరస్పాండెంట్ కే.నాగిరెడ్డి, డైరెక్టర్ కే.మహేష్ కుమార్, ప్రశాంతి ఒకేషనల్ కళాశాల కరెస్పాండంట్ ఆర్. ప్రభాకర్ గౌడ్, ప్రిన్సిపల్ యాదులు విద్యార్థిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ కళాశాలలో చదివిన చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని ఆయన గుర్తు చేశారు. కేవలం మార్కుల కోసం కాకుండా కాన్సెప్ట్ మరియు కెరీర్ ఓరియెంటెడ్ అంశలను బోధిస్తున్నట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రెండు బోర్‌లు వేయించిన కుమ్మరి లింగయ్య

నవతెలంగాణ-పుల్కల్

మండల పరిధిలోని పెద్దరెడ్డిపేట గ్రామంలో మంచినీటి ఎద్దడిని తీర్చడానికి అదే గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య తన సొంత ఖర్చుతో గురువారం రెండు మంచినీటు బోర్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయాలనే దృఢ నిశ్చయంతో ప్రజలకు నీటి ఎద్దటి కష్టాలను తీర్చడానికి బోర్లు వేయించినట్టు చెప్పారు. అతి త్వరలోనే ఈ బోర్లకు మోటర్లను బిగించి ప్రజలకు నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు గ్రామంలో స్వార్థ ప్రయోజనాల కోసమే పాలకులు పనిచేశారన్నారు. తాను మాత్రం ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఒకవేళ తనకు అవకాశం వస్తే రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఘనంగా పూజలు

నవతెలంగాణ-సదాశివపేట

జై భవాని శరణవరాత్రుల్లో భాగంగా స్థానిక గాంధీ చౌక్ వద్ద జై భవానియూత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు మొదటిరోజు బాలత్రిపుర సుందరిగా పూజలు అందుకున్నారు. ఈ పూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్ మరియు మాశెట్టి ప్రకాశం దంపతులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ యువ నాయకులు చింత సాయి హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రంలో జై భవాని యూత్ గౌరవ అధ్యక్షులు ఆకుల శివకుమార్ అధ్యక్షులు కోవూరి శంకర్ గౌడ్, కార్యదర్శి కళ్లెం సంగమేశ్వర్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల త్రిపుర సుందరిగా మున్మాదేవి

నవతెలంగాణ-రాయికోడ్



మండల కేంద్రమైన రాయికోడ్‌లోని మున్మాదేవి ఆలయంలో అమ్మవారు గురువారం బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో భజన కీర్తనలు ఆలపించారు.

అధికారుల కన్నుసైగల్లోనే కబ్జాలు?

- కాలువలను ఆక్రమిస్తున్నా పట్టించుకోని వైనం
- ఫిర్యాదు చేస్తేనే తూతూమంత్రంగా చర్యలు
- తెల్లాపూర్‌లో పెద్ద ఎత్తున విమర్శలు

నవతెలంగాణ-రామచంద్రాపురం



తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని చెరువులు, కుంటలు మాయమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అండదండలతోనే రియల్ మాఫియా ఈ కబ్జాలకు తెగిస్తున్నారని స్థానికులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. చెరువులు, కుంటలు, వరద కాలువల్లో నిర్మాణాలు చేపట్టినా.. అధికారులు వెళ్లి చూడడం లేదు. పత్రికల్లో లేదా స్థానికులు ఫిర్యాదు చేస్తేనే స్పందించి నామమాత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారే తప్పా.. వాటిని అడ్డుకున్న పాపాన పోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

తాజాగా తెల్లాపూర్‌లోని కుమ్మరికుంటను కొందరు దర్జాగా టిప్పర్లలో మొరం తెచ్చి నింపుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. చెరువులు, కుంటలు, వరద కాలువలను పరిరక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు. సమస్య పెద్దదైనప్పుడు మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు తప్పా.. వాటిని రక్షించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కుమ్మరి కుంట కబ్జా విషయంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులకు ముంద స్తుగానే తెలుసని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పత్రికల్లో రాగానే మున్సిపల్ అధికారులు నామ మాత్రంగా వచ్చి చర్యలు చేపట్టారని స్థానికులు చెప్పుకొస్తున్నారు. కాలువలో పెద్ద ఎత్తున మట్టి రాళ్ల వేసినా దానిని నామమాత్రంగా తొలగించి అధికారులు చేతులు దులుపుకున్నారే తప్పా.. దాంట్లో మట్టి ఎవరు నింపారు వారిపై కేసులు నమోదు చేయాలనే విషయాలను పట్టించుకోవడం లేదు. ఎవరైనా కాలువలను, చెరువులను కబ్జా చేస్తే వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు నావమాత్రంగా చర్యలు తీసుకోవడంలో మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరి కొంతమంది అధికారులు కబ్జాదారులకు ఆసరాగా నిలుస్తూ జేబులు నింపుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. దాంతోనే వారి కుర్చీలను సైతం కాపాడుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతికి పాల్పడే అధికారులపై ప్రభుత్వం ఎందుకు నిఘా పెట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా కుమ్మరి కుంటలో మట్టిపోసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తిరిగి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయిందని స్థానికులు వాపోతున్నారు. ఒకపక్క హైడ్రా చెరువులను, కుంటలను కాపాడుకునేందుకు కఠిన చర్యలు తీసుకుంటుంటే ఇక్కడ అధికారులు మాత్రం కబ్జాదారులకు వత్తాసు పలకడం ఏమిటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల వైఫల్యంతోనే కబ్జాలు



అధికారుల వైఫల్యంతోనే తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని చెరువులు, కుంటలు, నాళాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఫిర్యాదులు అందినా అధికారుల చర్యలు శూన్యం. వెంటనే తగు చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో చెరువులు, కుంటల మనుగడ కష్ట సాధ్యమవుతుంది. అధికారులు పత్రికలకు తలొగ్గకుండా వారి బాధ్యతను సక్రమంగా నిర్వహించాలి.

– మల్లేపల్లి బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్, తెల్లాపూర్

ప్రకృతికి విరుద్ధంగా కబ్జాలా?



ప్రకృతికి విరుద్ధంగా ఎవరికివారు స్వార్థం, లాభాల కోసం చెరువులు, కుంటలను కబ్జాలు చేయడం సరైన పద్ధతి కాదు. ఇలానే చెరువులను కబ్జాలు చేస్తూ ఉంటే రాబోయే రోజుల్లో నీరు కూడా దొరకక దుర్భర పరిస్థితి ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుంది. వర్షాలు పడితే నగరం మొత్తం అతలాకుతలమై ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు బాధ్యతగా వ్యవహరించి కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకొని చెరువుల పరిరక్షణ చేయాలి.

-కొల్లూరి భరత్, కౌన్సిలర్, తెల్లాపూర్



మంగంపేటను సందర్శించిన ఆర్‌అండ్‌బి రాష్ట్ర స్పెషల్ సెక్రటరీ

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని మంగంపేట గ్రామాన్ని ఐఏఎస్ ఆఫీసర్, ఆర్‌అండ్‌బి రాష్ట్ర స్పెషల్ సెక్రటరీ హరిచందన గురువారం ప్రత్యేకంగా సందర్శించారు. హౌస్ హెూల్డ్ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని ప్రారంభించి.. అధికారులు, స్థానిక గ్రామస్తులతో కలిసి పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, పటాన్ చెరువు ఈఆర్‌వో దేవుజ, జిన్నారం మండల తహసీల్దార్ బిక్షపతి, జిన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అరుణ రెడ్డి, పైలెట్ ప్రాజెక్టు సంబంధించిన అంశాలను ఆమెకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమం తీరుపై సంతోషం వ్యక్తం చేశారు. మంగంపేట గ్రామంలో 179 వరకు ఇల్లు ఉన్నాయని పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఈ కార్యక్రమం రెవిన్యూ, పంచాయతీరాజ్ ఇతరత్రా అధికార బృందాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నాయన్నారు. హౌస్ హెూల్డ్ డిజిటల్ కార్డు సర్వే పైలట్ ప్రాజెక్టు ప్రక్రియలో భాగంగా మంగపేట గ్రామాన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

వ్యాధి నియంత్రణలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర కీలకం

- వైద్య అధికారి డాక్టర్ గాయత్రీ దేవి

నవతెలంగాణ-సంగారెడ్డి



వ్యాధి నియంత్రణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రి దేవి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్ గాయత్రీ దేవి ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధి నియంత్రణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర చాలా కీలకమన్నారు. వ్యాధుల నిర్ధారణలో పరీక్షలు ప్రముఖ పాత్ర వహిస్తాయి అందుకు ల్యాబ్ టెక్నీషియన్లు నైపుణ్యం పెంచుకోవాలని ఎప్పటికప్పుడు టెక్నాలజీని నేర్చుకోవాలన్నారు. టీబీ నియంత్రణలో భాగంగా ఉమ్మి పరీక్షలు పెంచాలన్నారు. దీని ద్వారా టీబీ వ్యాధిని ముందస్తుగానే గుర్తించి చికిత్స చేయగలితే 2025 నాటికి జిల్లాలో ఆ వ్యాధిని గణనీయంగా అరికట్టవచ్చన్నారు. చికెన్ గునియా, మధుమేహం, మొదలగు వ్యాధులను అరికట్టడంలోపరీక్షలు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు.ఈ కార్యక్రవ ంలో ప్రభుత్వ వైద్య కళాశాల పాథాలజిస్ట్ డాక్టర్ మాధవి, జిల్లా మలేరియా అధికారి ప్రవీణ్ కుమార్, టీబీ నియంత్రణ అధికారిడాక్టర్అరుణ,జిల్లా సర్వేలెన్స్అధికారి రజిని పాల్గొన్నారు.

తోపుకొండలో డిజిటల్ కార్డుల సర్వే

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-కంది



మండలంలోని తోపుకొండ గ్రామంలో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ కోసం చేపట్టిన సర్వేను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అధికారులు కుటుంబ డేటాబేస్ ఆధారంగా సర్వే చేస్తుండగా.. ఆమె పలు సూచనలు చేశారు. సర్వేలో ప్రతీ కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సవ్యంగా సేకరణ జరగాలన్నారు. డిజిటల్ కార్డుల సర్వే పైలెట్ ప్రక్రియ నిర్ణీత సమయంలోపు పూర్తవ్వాలని, లక్ష్యంగా పెట్టుకున్న సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే నాణ్యతకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించడంలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించాలన్నారు. డిజిటల్ కార్డుల సర్వే గురించి గ్రామస్తులకు పూర్తి అవగాహన కల్పించడం, ప్రజలు తమ వివరాలు సక్రమంగా అందజేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సేవలు మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీ ఓ మహేందర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడి టీచర్లు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-సంగారెడ్డి

నాంపల్లి కోర్టు న్యాయవాది యం.డి.అబ్దుల్ కలీమ్‌పై పోలీ సుల దాడిని నిరసిస్తూ తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు గురువారం సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, అబ్దుల్ కలీమ్ పై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో క్రీడల కార్యదర్శి అశోక్, గ్రంథాలయ కార్యదర్శి కె. ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు జ్ఞానోభ, వినోద్ కుమార్, విజయ్ కుమార్, పెంటయ్య, మహిళా ప్రతినిధి లలిత, న్యాయవాదులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ ఛాంపియన్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలోని ఈ తక్షిల స్కూల్‌లో 43వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ ఛాంపియన్ 2024 జూనియర్ బాల, బాలికల పోటీలను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు. అనంతరం విద్యార్థులు ఎమ్మెల్యేకు గౌరవ వందనం చేశారు. రాష్ట్రంలోని 31 జిల్లాల విద్యార్థులు పాలగ్గొనే క్రీడలను మరియు వారి నృత్య ప్రదర్శనను ఎమ్మెల్యే వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమం ఈ-తక్షీల స్కూల్ యాజమాన్య బృందం, ఎస్జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, డా.రమేష్ రెడ్డి, తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి ఐలయ్య, సంగారెడ్డి జిల్లా పిఈటి కార్యదర్శి మారుతి, ఈ తక్షల కరస్పాండెంట్ శరత్ పిఈటి ప్రెసిడెంట్ గణేష్,శంకర్ ముదిరాజ్, స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలశయాత్రలో పాల్గొన్న కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బొల్లారం మున్సిపాల్టీ పరిధిలో గురువారం బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో కలశ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం స్థానిక దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతి ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలను మున్సిపాల్టీలో అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రతీ ఒక్కరి ఆచార సంప్రదాయాలను గౌరవించాలన్నారు. అనంతరం కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులను స్థానిక మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మా రెడ్డి, మున్సిపల్ బీజేపీ పార్టీ అధ్యక్షులు కెజేఆర్ ఆనంద్ కృష్ణా రెడ్డి, స్థానిక నాయకులు రమణయ్య, రాజ్ గోపాల్, దినసాథ్, జె.జె సింగ్, రాజారామ్, శ్రీమన్నారాయణ, చంద్రశేఖర్, శ్రవణ్, మా అంబి మహిళా సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు బట్టలు పంపిణీ

నవతెలంగాణ-జోగిపేట



లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ కే. అనంతరెడ్డి మనమరాలు చిన్మయి పుట్టినరోజు, ఆయన కుమారుడు కీర్తిశేషులు కె. అరుణ్ కుమార్ జ్ఞాపకార్థం జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శివాజీ నగర్ ఏరియాలోని ఆయన స్వగృహంలో మున్సిపల్ కార్మికులకు బట్టల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, కమిషనర్ తిరుప తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ మంచి పేరు తెచ్చుకుంటున్నారన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రతిసారి సహాయ సహకారాలు అందించడం అభినందనీ యమన్నారు. మున్సిపల్‌లో పనిచేసే పారిశుధ్య, వాటర్ వర్క్స్ కార్మికులకు మొత్తం 76 మందికి బట్టలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శిలు ఎస్. జగన్ మోహన్ రెడ్డి, ఎం.పద్మనాభరెడ్డి, ఆకుల రాంబాబు, పట్టణ అధ్యక్షులు అల్లే శ్రీకాంత్, కోశాధికారి గడ్డమీది సంతోష్, మాజీ అధ్యక్షులు ఎం. జగన్ మోహన్ రెడ్డి, సుధాకర్, సభ్యులు మాణిక్ రెడ్డి, రవి శేఖర్ రెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ దయానంద్, జాన్ పాల్, సానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్, మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు !

- జీ ప్లస్ టు పర్మిషన్లు, 4, 5 అంతస్తుల నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాలపై చర్యలేవి
- ఇంద్రేశం మాజీ సర్పంచ్ బండి హరిశంకర్

నవతెలంగాణ-పటాన్‌చెరు




ఇంద్రేశం పంచాయతీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్టు ఆ గ్రామ మాజీ సర్పంచ్ బండి హరిశంకర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రేశం పంచాయతీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని.. వాటిని పంచాయతీ కార్యదర్శి ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ పరిధిలో బిల్డింగ్ నిర్మాణాలకు జీ ప్లస్ టు పర్మిషన్ ఉండగా నాలుగు, ఐదు అంతస్తులతో నిర్మాణాలు చేపట్టినా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నా రన్నారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినప్పటికీ, ఆ బిల్డర్లు ఇప్పుడు నిర్మాణాలు చేపడుతుంటే కార్యదర్శి తనకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నాడన్నారు. అక్రమ నిర్మాణాల పైన జిల్లా అధికారులకు అన్ని విషయాలు తెలిసినప్పటికీ, వాస్తవ విరుద్ధంగా నచ్చచెబుతున్నారని ఆరోపించారు. కనీసం మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా అని చూడకుండా నిర్మాణాలకు పర్మిషన్లు ఇస్తున్నారని వాపోయారు. అక్రమ నిర్మాణాలకు నివారించాలని గతంలో ఎన్నిసార్లు కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లిన బేఖాతరు చేశారని చెప్పారు. జిల్లా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అరిక ట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-జహీరాబాద్



స్థానిక ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థులు షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో బతుకమ్మ సంబురాలను గురువారం అంగరంగా వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కరెస్పాండెంట్ గుత్త మాధవి హాజరై పూజా కార్యక్రమాన్ని నిర్వహించి సంబు రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ ఆడపడుచులు మన ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా ఈ బతుకమ్మ పండుగ జరుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరి కుమార్ డైరెక్టర్లు వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, షెట్కార్, స్వాతి, రేణుక, అధ్యాపకులు నందు గౌడ్, దత్తు, రమేష్ ,నర్సింలు, సురేష్, నవీన ,నికిత, దీపిక,శ్వేత, ఇర్షత్ సుల్తానా,కరుణ, సల్మా, ప్రియాంక,మౌనిక విద్యార్థులు పాల్గొన్నారు.



జిన్నారం : మండల పరిధిలోని జంగంపేట గ్రామంలో బతుకమ్మ సంబరాల కార్యక్రమా లను గురువారం డాన్ బాస్కో పాఠశాల బృందం స్థానిక గ్రామస్తులు కలిసి ప్రత్యేకంగా జరిపారు.

శ్రీ పద్మనాభ కళాశాలలో 'ధ్వని ద సౌండ్ ఆఫ్ ఎంజాయ్‌మెంట్'

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పట్టణంలోని శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాల 'ధ్వని ద సౌండ్ ఆఫ్ ఎంజాయ్‌మెంట్' అనే కార్యక్రమం ఎన్ గార్డెన్‌లో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ మాటాడుతూ.. శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాల విద్యార్థులు వినయ, విధేయతలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మరియు స్పోర్ట్స్, గేమ్స్ మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్టు వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. కళాశాల డైరెక్టర్ అంబటి విశ్వనాథం మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న చీకటిని, రుగ్మతలను పారదోలే శక్తి కేవలం విద్యకే ఉన్నదని.. కాబట్టి అందరూ సంపూర్ణ విద్యావంతులై సమాజంలో మంచిమార్పు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరవిందరావు, ప్రవీణ్ కుమార్, నర్సింలు, సౌజన్య, సతీష్ కుమార్, సంగమేశ్వర్ రెడ్డి, జంగం మహేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



- సర్వేను పరిశీలించిన నోడల్ అధికారి

నవతెలంగాణ-మెదక్ టౌన్

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం జరుగుతున్న సర్వే పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి ఆర్డీవో రమాదేవి తెలిపారు. గురువారం మెదక్ మున్సిపల్ పరిధిలో ఎంపిక చేసిన కుటుంబాలలో 7వ తేదీ వరకు జరిగే డిజిటల్ కార్డు జారీ ప్రక్రియకు సంబంధించిన సర్వేను మున్సిపాలిటీ పరిధిలోని ఆర్డీఓ రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి సర్వే చేస్తున్న అధికారులతో మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేరు, జెండర్, పుట్టిన తేదీ, వయసు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, ఆధార్ నంబర్, అడ్రస్ తదితర వివరాలన్ని పక్కాగా ఏ ఒక్కటి తప్పకుండా నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు కనీసం 50 కుటుంబాలలో సర్వే అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి కావాలన్నారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న బృందాల వారికి తగు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహశీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

నవతెలంగాణ-చిన్న శంకరంపేట : మండలంలోని కామా రం గ్రామంలో గురువారం జాయింట్ కలెక్టర్ వెంక టేశ్వర్లు ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆధార్ కార్డు, రేషన్ కార్డులను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, తహశీల్దార్ మన్నన్, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సెల్ ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

- ఏపీఎం పెంటా గౌడ్



నవతెలంగాణ-మనోహరాబాద్

సంగారెడ్డిలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో గాగ్రామీణ పురుషులకు సెల్ ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఎం పెంటా గౌడ్ తెలిపారు. ఉచిత శిక్షణకు మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ పురుషులకు మాత్రమే అర్హులని శిక్షణ పొందేవారు 18 సం నిండి ఉండి 45 సం లోపు ఉండాలన్నారు. శిక్షణా సమయంలో ఉచితభోజనం, ఉచిత వసతి కల్పించడంతో పాటు శిక్షణ ముగిసిన తర్వాత ఉచిత సెల్ ఫోన్ రిపేర్ టూల్ కిట్ అందజేస్తారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులను గ్రామీణ నిరుద్యోగ యువకులు సద్విని యోగపర్చు కోవాలని ఎస్బిఐ ఎస్ ఇటిఐ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ సూచిం చారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రేషన్ కార్డ్ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, 10వ తరగతి జిరాక్స్ ప్రతులు, బ్యాంక్ అకౌంట్ వివరాలు అందజేయాల్సి ఉం టుందన్నారు. పూర్తి వివరాలకు 9490103390, 9490129839 నెంబర్‌లను సంప్రదించాలలని సూచించారు. అక్టోబర్ 12వ తేది వరకు నిరుద్యోగ యువకులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని పెంటా గౌడ్ పేర్కొన్నారు.

విద్యానగర్ కాలనీలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-తూప్రాన్

పట్టణంలోని 5వ వార్డు విద్యానగర్ కాలనిలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబరాలకు కాలనీ ఆడపడుచులు సాంప్రదాయ దుస్తులలో వచ్చి బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ ఆడపడుచులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యా నగర్ కాలనీలో ప్రతి సంవత్సరం కాలనీ వాళ్లందరితో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. భారతీయ సంస్కృతిలో అనేక రకాల పండుగలు జరుపుతున్నప్పటికీ ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే పూలను పూజించి చేసుకునే ఏకైక గొప్ప పండుగ బతుకమ్మ పండుగ తెలిపారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు స్వాగత ఏర్పాట్లు



నవ తెలంగాణ-తూప్రాన్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా తూప్రాన్ టోల్ ప్లాజా నుంచి వెళుతున్న సందర్భంగా స్వాగత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ తెలిపారు. టోల్ ప్లాజా వద్ద ఘన స్వాగతం పలకనున్నామని దేవేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని దేవేందర్ కోరారు.

ప్రముఖ పురోహితులు చాడ నందబాల శర్మ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-గజ్వేల్

ధర్మ రక్షణలో ముందువరుసలో ఉండే ప్రముఖ పురోహితులు చాడ నందబాల శర్మ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు, యువజన ప్రతినిధులు మంతూరి నాగరాజు, ప్రేమ్ కుమార్, రాజు, నాగరాజు, భాస్కర్, వెంకటేష్, వేణు ఆధ్వర్యంలో శాలువా కప్పి జ్ఞాపికను అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కొమురవెల్లి

అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబాన్ని జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి గురువారం పరామర్శించారు. జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాలిక విద్యకు సహకరిస్తానని, గురువన్నపేటలో జరిగిన ఘటనలో గ్రామస్తులపై నమోదైన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, చేర్యాల, కొమురవెల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, కొమ్ము రవి, ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, కాయిత శ్రీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సానాది భాస్కర్, మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, మెరుగు శ్రీనివాస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ చింతల రమేష్ చేర్యాల పీఏసీఎస్ చైర్మెన్ మెరుగు కృష్ణ, చేర్యా పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవి, కౌన్సిలర్లు ఆడేపు నరేందర్, చెవిటి లింగం, ముస్త్యాల తార యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

లావణ్య మృతి బాధాకరం

నవతెలంగాణ-తొగుట



తీవ్ర జ్వరంతో బాధపడుతూ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శేర్ల లావణ్య మృతి చెందడం బాధాకరం అని బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన శేర్ల యాదగిరి సతీమణి లావణ్య (33) తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఆకస్మికంగా అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం లావణ్య మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ నర్సెట్టి మల్లేశం, గ్రామ పార్టీ అధ్య క్షులు జనగామ సుభాష్ గౌడ్, నాయకులు డబ్బి కారి పెంటోజీ, బొడ్డు భూమయ్య, కిషన్, బండారు స్వామి గౌడ్, సుతారి రాంబాబు, ఎంగలి నరేందర్ తదితరులు ఉన్నారు.

అధిక విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలి

- జిల్లాకు 2000 ఎకరాలలో ఆయిల్ ఫామ్
- తోటల సాగు చేయుటకు పగడ్బందీగా ప్రణాళిక
- జిల్లాలో 1231 ఎకరాలకి రైతులు రిజిస్ట్రేషన్
- జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

మెదక్ జిల్లాలో రైతులు అధిక విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టి ఇతర పంటల కంటే అధిక దిగుబడి పొందవచ్చునని జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్ అన్నారు. గురువారం హవేలీ ఘనాపూర్ రైతు వేదికలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ, లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలన్నారు. దీని వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చున్నారు. ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని, పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఏ పంటకి లేని విధంగా చట్టం ద్వారా, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని, కోతుల బెడద లేని పంట రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని కోరారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టు రైతులకు మొక్కలపై రాయితీతో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ అంతర పంటల సాగు కొరకు రాయితీ మొత్తంగా 26,450 సొమ్మును రైతుల ఖాతాకు జమ చేయబడుతుందని తెలిపారు.

డాక్టర్ రంగనాయకులు ఆయిల్ పామ్ సాగు గురించి కూలంకషంగా వివరిస్తూ ఎకరానికి 57 మొక్కలను త్రికోణ ఆకార పద్దతి ద్వారా నాటుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వస్తుందని, ఒక్క టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ 13,500లు ఉంటుందన్నారు. ఈ లెక్కన సంవత్సరమునకు రూ 1,62,000 ఆదాయం వస్తుందని, ఖర్చులు పోను ఒక ఎకరానికి సంవత్సరానికి రూ 1,20,000 పొందవచ్చని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మెదక్ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 78 మంది రైతులు 336 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టారన్నారు. ఈ సంవత్సరం 2024-25 సంవత్సరానికి మెదక్ జిల్లాకు 2000 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటల సాగు చేయుటకు ప్రణాళికా చేసుకోవడం జరిగిందన్నారు. 1231 ఎకరాలకి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం అందులో నుంచి ఇప్పటివరకు 233 ఎకరాలు ఆయిల్ పామ్ తోటలు పెట్టించడం జరిగిందన్నారు. మెదక్ జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంచుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టి ఇతర పంటల కంటే అధిక దిగుబడి లాభం పొందవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు టెక్నికల్ వినయ్, మెదక్ డివిజన్ వ్యవసాయ ఉప సంచాలకులు విజయ నిర్మల, రాష్ట్ర ఆయిల్ పామ్





టెక్నికల్ సలహాదారులు డాక్టర్ రంగనాయకులు, ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి, నర్సాపూర్ ఉద్యాన అధి కారి సంతోష్, మెదక్ ఉద్యాన అధికారి రచన, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఏఈఓలు ప్రశాంత్, భార్గవ్,ఆయిల్ పామ్ విస్తరణ అధికారులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కును ఓపెన్ చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్కును ఓపెన్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. గురువారం జెండా ఆవిష్కరణ కావించి సీపీఐ(ఎం) ఏరియా మహాసభను మల్లేశం ప్రారంభించారు. జిల్లా కేంద్రం టీఎన్జీవో భవనంలో మెదక్ ఏరియా రెండవ మహాసభ జరిగింది. సిహెచ్ లక్ష గౌడ్ యశోద అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో కామ్రేడ్ సీతారాం ఏచూరి. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గత 3 సంవత్సరాల కాలంలో జరిగిన పార్టీ కార్యక్రమాలు, అనుభవాలను సమీక్షించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకున్నారు. అలాగే ఈ మహాసభ సందర్భంగా పార్టీ పలు తీర్మాణాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్కును ఓపెన్ చేయాలని, మెదక్ పట్టణ కేంద్రంలో డబుల్ బెడ్రమ్ ఇండ్లలో సౌకర్యాలు కల్పించాలన్నారు. మినీ ట్యాంక్ బండ్ కోసం మంజూరైన రూ.9 కోట్లు ఖర్చు చేయాలని, మార్కెట్‌లో నిర్మించిన సమీకృత భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు కే మల్లేశం, బసవరాజు, జిల్లా నాయకులు మల్లేశం, నారాయణ, మైనుద్దీన్, షౌకత్, యాదగిరి, భీమేష్, దాసు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మెదక్ ఏరియా కమిటీ కార్యదర్శిగా కే మల్లేశం, సహాయ కార్యదర్శులు సిహెచ్ లచ్చ గౌడ్, జి బాల నర్సయ్య, పి దేవయ్య యశోద, నాగమణిలను సభ్యులుగా ఎన్నుకున్నారు.

వెల్దుర్తికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

- మేడ్చల్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రానికి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ పలువురు మేడ్చల్ డిపో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాలలకు, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిపోయే ఆయా శాఖల అధికారులు పలు కార్యాలయాలకు వచ్చే ప్రజలకు రవాణా సౌకర్యం సరిగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోయారు. ఈ మేరకు గతంలో ఎంపీ రఘునందన్ రావుకు విజ్ఞప్తి చేయగా, ఎంపీ రఘునందన్ రావు స్పందించి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీ తన లెటర్ ప్యాడ్‌పై మేడ్చల్ డిపో మేనేజర్‌కు ఉత్తరం రాశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం బీజేవైఎం మండల అధ్యక్షుడు కృష్ణం నవీన్ పటేల్ బీజేపీ మండల నాయకులు గడ్డం నాగరాజు మరికొంతమందితో కలిసి మేడ్చల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన డిపో మేనేజర్ రూట్ మ్యాప్‌ను పరిశీలించిన అనంతరం బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు.



ఏడుపాయలలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- ముఖ్యఅతిథిగా హాజరైన మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-పాపన్నపేట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 12 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం ముందు నుంచి మంజీరా నది పరవళ్ళు తొక్కుతుండడంతో గత కొంతకాలంగా రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు. అయితే ఏడుపాయలలోని గోకుల్ షెడ్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురం నుంచి గోకుల్ షెడ్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి గోకుల్ షెడ్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్టించారు. ఈ సందర్భంగా తొగుట పీఠాధిపతి మాధవ నంద స్వామితోపాటు స్థానిక పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తూ రాజగోపురానికి తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మండల సీనియర్ నాయకులు గోవిందు నాయక్. మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, పార్శా నర్సింలుతోపాటు





పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాల త్రిపుర సుందరి దేవిగా...

మొదటి రోజైన గురువారం అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవిగా ముదురు పసుపు రంగులో దర్శనమిచ్చారు. రెండవ రోజు అయిన శుక్రవారం గాయత్రి దేవి రూపంలో గులాబీ రంగులో దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ వెల్లడించారు.

ఘనంగా ప్రారంభమైన దేవీ నవరాత్రి ఉత్సవాలు



నవతెలంగాణ-గజ్వేల్

ప్రతి ఏటా మాదిరిగానే గురువారం దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గజ్వేల్ పట్టణంలో పలు వీధుల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సూర్యవంశం ఆరెకటిక ఆధ్వర్యంలో స్థానిక వేజ్ నాన్వెజ్ మార్కెట్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. 25 ఏండ్లుగా ఆరకటికలు దేవీ నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మహిళలు భారీ ఎత్తున పాల్గొని మొదటి రోజు కుంకుమార్చన మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగం నాయకులు కిషన్, నర్సింగరావు, లింగోజి, రమేష్, విట్టల్, నందులాల్, బన్సీలాల్, నాగరాజు, శ్రీనివాస్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కొలువు దీరిన దుర్గా మాత



నవతెలంగాణ -నంగునూరు

దుర్గా మాత నవరాత్రోత్సవాలలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో మండపాల వద్దకు అమ్మవారిని తరలించి గురువారం ప్రతిష్టించారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మ వారికి వివిధ అలంకరణలతో దేవీ నవరాత్రులను ఘనంగా జరపనున్నారు. మండలం కేంద్రంలో దేవి శరన్నవరాత్రోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవంలో భాగంగా గ్రామంలోని పురవీధుల గుండా మహిళలు కోలాటం ఆడుతూ అమ్మవారిని ఊరేగింపుగా మండపం వద్దకు తీసుకువచ్చి ప్రతిష్టించారు. అనంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు రోజుకో అలంకరణతో దర్శనమిస్తుందని ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య

-చోద్యం చూస్తున్న విద్యాధికారులు
- తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కాచం శ్రీనివాస్



నవతెలంగాణ- సిద్దిపేట

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విధంగా అక్టోబర్ 2 నుంచి 14 వరకు అన్ని ప్రభుత్వ ప్రయివేట్ విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వగా, సిద్దిపేట పట్టణంలో శ్రీ చైతన్య ప్రయివేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారా అని తెలంగాణ ప్రయివేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కాచం శ్రీనివాస్ గురువారం అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సెలవులు ప్రకటించినప్పటికీ ఇవన్నీ మాకు వర్తించవన్నట్టు ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యాలు విద్యార్థులను, ఉపాధ్యాయులతో సెలవులలో సైతం పాఠశాలు నడిపిస్తున్నారని, ఇలా ఎందుకు నడిపిస్తున్నారని ప్రశ్నించిన తెలంగాణ ప్రయివేట్ టీచర్ ఫోరం సభ్యులను మా ఇష్టం, ప్రభుత్వ నిబంధనలు మేము పట్టించుకోము, మా యాజమాన్యం చెప్పిన ప్రకారం పాఠశాలలను నడిపిస్తామని, మీరు ఎవరికైనా చెప్పుకోండి అని శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం మధు తెగేసి చెప్పున్నారని తెలిపారు. మహిళా ఉపాధ్యాయులను కూడా సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలో ఉంచి పని చేయిస్తున్నారని, ఈ విషయమై జిల్లా విద్యాధికారులను టీపీటీఎఫ్ సంప్రదించగా వారు ఫోనులో మాట్లాడి ఆయా ప్రయివేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠశాలలు మూసివేయమని ఆదేశాలు ఇచ్చారు, కానీ ఆదేశాలను పాటించకుండా పాఠశాల నడిపిస్తున్నారని, జిల్లా విద్యాశాఖ అధికారుల ఉత్తర్వులు కేవలం కాగితాలకే మాత్రమే పరిమితమయ్యాయని అన్నారు. ఆ ఉత్తర్వులను అమలు చేసే బాధ్యత కూడా జిల్లా విద్యాశాఖ అధికారులదే అని, జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోకపోతే జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ నవీద్, జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు ప్రజాపతి, యాంసాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలతోనే సంతృప్తి

నవతెలంగాణ-కొల్చారం

నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు సమాజ సేవలో మేము సైతం అంటూ ముందుకు సాగాలని ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షులు మన్నె సాయిచరణ్ అన్నారు. గురువారం కొల్చారం మండలంలోని రంగంపేట, చిన్నఘణపూర్, పోతంశెట్టిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఎంఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో దేవి నవరాత్రులను పురస్కరించుకుని సుమారు లక్ష రూపాయలను మంటప నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా ప్రవృత్తిని అభిరుచిగా మార్చుకుని సోషల్ సర్వీస్ చేయాలనే తపనతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. సామాజిక సేవలతోనే తమకు సంతృప్తినిస్తుందన్నారు. యువకులు తమను ప్రోత్సహిస్తే మరింత సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో యాదారం లక్ష్మికి రూ.45 వేల చెక్కును, కేశావుల వంశీకి రూ.9 వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు లక్ష్మణ్ గౌడ్ గురువారం అందజేఖీవని౹ఱ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో చెక్కులు మంజూరు అయ్యాయని తెలిపారు. లబ్ధిదారుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు, నారాయణ, స్వామి, అశోక్, ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతరావుపై క్రిమినల్ కేసు పెట్టండి

- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వంటేరు



నవతెలంగాణ-గజ్వేల్

మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు అరెస్టు చేసు పై క్రిమినల్ కేసు పెట్టాలని బీఆర్ఎస్ నేతలు వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, వైస్ చైర్మెన్ జాకీర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ గురువారం గజ్వేల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..గజ్వేల్ పట్టణంలో ఇటీవల మైనంపల్లి హనుమంతరావు తమ నేతలపై ఇష్టారాంగా నోరు పారేసుకున్నారని, చట్టారీత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేర చరిత్ర కలిగిన మైనంపల్లి హనుమంతరావును పోలీసులు వెంటనే అదుపులో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మల్లేశం, మండల అధ్యక్షులు బెండ మధు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు రజిత గౌడ్, గుంటుకు శిరీష రాజు, అర్చన శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

స్పందన



నవతెలంగాణ-మర్కుక్

'నవతెలంగాణ'లో గురువారం 'ముండ్ల పొదలతో ముప్పు తిప్పలు, రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని చేబర్తి నుంచి మర్కుక్ వరకు ముండ్ల పొదలను తొలగించాలని మర్కుక్ ఎంపీడీవో అదేశాల మేరకు చేబర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్ చేబర్తి శివారు పరిధి వరకు జేసీబీతో ముండ్ల పొదలను తొలగించారు. మర్కుక్ శివారు పరిధిలో ఉన్న ముండ్ల పొదలను తొలగించమని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చామని ఎంపివో రాజలింగం తెలిపారు.

మంత్రి సురేఖ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-కొండపాక

బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి కేటీఆర్‌ను కించపరిచే విధంగా మాట్లాడినందుకు నిరసనగా మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను కొండపాకలో గురువారం బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ నాయకులు అంబటి బాలచందర్ గౌడ్ బీఆర్ఎస్వి నాయకులు మారబోయిన ప్రశాంత్ మాట్లాడుతూ.. ఒక మంత్రి దిగజారుడు మాటలు మాట్లాడడం సరైనది కాదన్నారు. మాటలను వెనక్కి తీసుకొని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేపాక యాదగిరి తిప్పారం హరీష్ కుమార్ ,చెన్న రమేష్, తుపాకుల శేఖర్, అరుణ్ కుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో 24 గ్రామాల గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశం జిల్లా పంచాయతీ అధికారి, నంగునూరు మండల ప్రత్యేక అధికారి దేవికి దేవి మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పైప్ లైన్ లీకేజీలు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చేతి పంపుల వినియోగంపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలు తాగు నీటిని పొదుపుగా వాడుకునేలా చూడాలని సూచించారు. సింగిల్ ఫేజ్ మోటార్లు కాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ సుమలత, ఎఈ నర్సింగరావు, శిక్షకుడు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండిస్తున్నాం



నవతెలంగాణ-జగదేవపూర్

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కాన్వాయ్ పై కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ జగదేవపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుద్ద నాగరాజు అన్నారు. జగదేవపూర్ లో గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు బాధ్యతను మరచిపోయి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గుండాగిరి చేస్తున్నారని, ప్రజా రాజ్యమని అనుకుంటూ గుండాగిరి రాజ్యం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలపై ఇలాగే దాడులు చేస్తే తిరిగి ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. దుబ్బాక ఎమ్మెల్యేపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏదైనా ఉంటే రాజకీయంగా తమ శక్తిని చూపించుకోవాలి తప్ప దాడులు చేసే సంస్కృతి తెలంగాణలో లేదు అన్నారు. బీఆర్ఎస్ సైన్యం కూడా చాలా ఓపికగా చూస్తున్నారు అని తెలిపారు. మాకు ఓపిక నసిస్తే పరిణామాలు వేరే ఉంటాయని అన్నారు.


ఇద్దరు దొంగలకు రిమాండ్



నవతెలంగాణ-కొండపాక

వ్యవసాయ బావుల వద్ద బోరు మోటర్లు, కరెంటు వైర్లు ఇనుప సామాన్లు దొంగతనం చేసే ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి కుక్కునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాకకు చెందిన నూనె నర్సింలు, పానేటి ఎల్లయ్య జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. లకుడారం ఎక్స్ రోడ్ వద్ద గురువారం ఉదయం 4 గంటలకు కుకునూరుపల్లి పోలీసులు పెట్రోలింగ్ చేసుండగా అనుమానాస్పదంగా కనబడిన ఆటోను ఆపి విచారించగా ఇద్దరి నిందితులు బోరు మోటర్ల వద్ద కరెంటు వైరు, బోరు మోటార్లను గత కొన్ని రోజుల నుంచి దొంగలించి గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నామని ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద ఉన్న ఆటో నెంబర్ ఏపీ23 ఎక్స్-3359 స్వాధీనం చేసుకుని ,ఇద్దరి నిందితుల వద్ద నుంచి రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దుబ్బాకలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-దుబ్బాక

నియోజకవర్గ పరిధిలోని 83 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.17.80 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను దుబ్బాక మున్సిపల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఎమ్మెల్యే వెంట వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ శేర్ల కైలాష్, మాజీ జెడ్పీటీసీ కడ్తాల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, బండి రాజు,చింతల కృష్ణ, కొత్త కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ దుబ్బాక మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, పర్స దేవరాజ్ ముదిరాజ్, ఉన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-కొండపాక

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ పురస్కరించుకొని మండల కేంద్రమైన కొండపాక ఆనంద నిల యంలో 75 మంది వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ రావు వయోవృద్ధులందరూ బిపి ,షుగరు, గుండె సంబంధిత వ్యాధులు మానసిక సమస్యలు ,కంటి చూపు తదితర సమస్యలు అడిగి తెలుసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయో వృద్ధులందరు మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండాలని అందరూ కూడా యోగ, ధ్యానం అలవాటు చేసుకుని ,డాక్టర్ సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, కోఆర్డినేటర్ రాజేందర్, రమణ, హెచ్ ఇ ఓ రమణ, ఎం ఎల్ హెచ్ పి సంధ్య, ఏఎన్ఎంలు నాగమణి, రాజకుమారి పాల్గొన్నారు

40 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నాం

- కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ షాబుద్దీన్



నవతెలంగాణ-సిద్దిపేట

గత 40 ఏళ్లుగా సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా కాంగ్రెస్ లోనే కొనసాగుతూ..పార్టీ కోసం పని చేస్తున్నానని. నిబద్ధత కలిగిన కాంగ్రెస్ నాయకులను గాని, కార్యకర్తలను గాని దూషించే స్థాయి చక్రధర్ గౌడ్‌కు లేదని కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ షాబుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు సలీంతో కలిసి మాట్లాడారు. దొంగ నోట్ల కేసులో, రేప్ కేసులో అరెస్ట్ అయి, తన ను తాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీలో చేరి, సీనియర్ నాయకులను కార్య కర్తలను నోటికి వచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. హరీశ్ రావుకు సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకులు కోవర్టులుగా పనిచేస్తున్నారనీ, హరీశ్ రావుతో నేనే పోరాటం చేస్తున్నానని అనుకునే నీవు కాంగ్రెస్ పార్టీ తరపున ఏం కేసు అయి ందో ప్రజలకు చెప్పాలన్నారు. ఏ యూట్యూబ్ ఛానల్ ద్వారా అయితే కాంగ్రెస్ నా యకులపై అసత్య ఆరోపణలు చేశారో అదే చానల్ ద్వారా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు పరుశురాములు పాల్గొన్నారు.

దుర్గమ్మ గుడి నిర్మాణం కోసం ఆర్థిక సాయం



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

మండలం పరిధిలోని పుల్లూరు గ్రామంలో అంబేద్కర్ సంఘం వారి ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గమ్మ తల్లి గుడి నిర్మాణం కోసం వంగ రాజేశ్వర్ రెడ్డి రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. గుడి నిర్మాణానికి సహకరించి రాజేశ్వర్ రెడ్డికి అంబేద్కర్ సంఘం వారు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్ యాదవ్, కనకయ్య. మల్లయ్య, రాజు, నర్సింలు మరియు అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆగని రేషన్ బియ్యం దందా...!



- రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లదే కీలక పాత్ర
- అక్రమార్కులకు కాసుల వర్షం
- నియంత్రణ మరచిన అధికారులు





నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని పలు వార్డులతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కొందరు దళారులు ఇంటింటికీ తిరుగుతూ తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొంటున్నారు. ఇలా కొన్న ఆ బియాన్ని మండలంలో కొన్ని రైస్ మిల్లుల కు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా సేకరించిన రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లర్లు రీసైక్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు మండలంలో జోరుగా చర్చ జరుగుతుంది. ఇంత జరుగుతున్నా క్షేత్రస్థాయిలో కింది స్థాయి అధికారులు చూసీ చూడనట్టుగా మిన్నకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దందాలో రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. రేషన్ బియ్యం పేదలకు ఉచితంగా అందాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం కొందరు అధికారుల అలసత్వం వల్ల నీరుగారిపోతుంది.

> దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద, మధ్యతరగతి ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తుండగా.. అవి అక్రమార్కుల పాలవుతు న్నాయి. టాస్క్ ఫోర్స్, ఎన్ ఫోర్స్ మెంట్, పోలీస్ శాఖలు దాడులు చేస్తున్నా.. ఈ అక్రమ రేషన్ బియ్యం దందా ఆగడం లేదు. పలు రాష్ట్రాల్లో డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు ఈ దందాను ప్రధాన ఆదాయవనరుగా మలుచుకుంటున్నారు. ఈ దందా సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మూడు పూలు ఆరు కాయలు అన్న చం దంగా.. ఎలాంటి ఆటంకాలు లేకుండా అక్రమా ర్కు లకు కాసుల వర్షం కురిపిస్తోంది.

అక్రమార్కులకు కాసుల వర్షం.. నియంత్రణ మరచిన అధికారులు....

ప్రతినెల 1 నుంచి 15వ తేదీ వరకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని సేకరించేందుకు కొందరు రైస్ మిల్లర్లు ప్రత్యేకంగా దళారులను నియమించుకున్నట్లు సమాచా రం. బైకులు, ఆటోల్లో మండల ంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కిలో రూ.8 నుంచి రూ.12 వరకు రేషన్ బియ్యాన్ని కొంటున్నారు. ఇలా పెద్ద ఎత్తున సేకరించిన తర్వాత భారీ వాహనాలు, లారీల ద్వారా మండలంలోని కొన్ని రైస్ మిల్లర్లకు తరలిస్తూ రూ.30 వరకు అమ్ముకు ంటున్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి రీసైక్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ.. రైస్ మిల్లర్ల యాజమాన్యాలు భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా కొన్నిచోట్ల రేషన్ డీలర్లు లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకొని కిలో రూ.8 చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇలా సేకరించిన బియ్యాన్ని ముందుగానే ఒప్పందం చేసుకున్న రైస్ మిల్లర్లకు అప్పగిస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత వాటిని ప్యాకింగ్ చేసి ఆయా మిల్లర్ల పేరిట లేబుల్ చేసి మరీ సొంత బ్రాండ్ పేరిట పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లల్లో వెనకేసుకుంటున్నట్లు.. కొందరు అధికారుల అండదండలతోనే అక్రమార్కులు ఈ దందాను సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్న రేషన్ బియ్యం దందాను నియంత్రించడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలకు తావిస్తోంది.

ఇటీవల పట్టుబడ్డ రేషన్ బియ్యం

1. ఈ ఏడాది ఫిబ్రవరి 8న దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో 36 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, 2 వాహనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.
2. మే 18న పెద్ద చీకోడులో ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు.
3. జూన్ 8న మండలంలోని పద్మనాభునిపల్లి గ్రామ పంచాయతీ పరిధి మర్రికుంట శివార్లలో 136 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గూడ్స్ కంటైనర్ లో సిద్దిపేట నుంచి మెదక్ తరలిస్తుండగా పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.
4. జూన్ 25న చీకోడ్ శివార్లలో బొలెరో వాహనంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు.
5. జూలై 12న తిమ్మాపూర్ గ్రామంలో మూడు ఆటోల్లో అక్రమంగా దాచిపెట్టిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

కార్పొరేట్లకు ఊడిగం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించండి

- కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) నిరంతర పోరాటం
- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్



నవతెలంగాణ-చేర్యాల

కార్పొరేట్లకు ఊడిగం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. చేర్యాల మండల పరిధిలోని నాగపురి గ్రామంలో గురువారం గ్రామ సీపీఐ(ఎం)మహాసభ మోకు దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. మహాసభకు రాళ్లబండి శశిధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం)నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. నేడు సంపద సృష్టించే కార్మిక, కర్షక అనుకూల విధానాలను వీడి పెట్టుబడిదారీ కార్పొరేట్ విధానాలను ప్రోత్సహించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై నిరంతరం పోరాడుతుందని, అంతిమంగా కార్మికులు, కర్షకులదే విజయమని అన్నారు. దేశంలో ఉన్న బూర్జువా పార్టీలను ప్రతిఘటించిన నాడే కార్మికుల, కర్షకులకు అనుకూల పరిస్థితులు సాధ్యమైతాయని, దోపిడి విధానం పోయి సమ సమాజం సిద్ధిస్తుందన్నారు. నిత్యం కార్మికుల, కర్షకుల కోసం నిర్వహించే పోరాటాల్లో శ్రామికులు, కర్షకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మిక వర్గం, రైతులు, శ్రామిక ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతు, కార్మిక, శ్రామిక ప్రజల బతుకులు దుర్భరంగా దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సీపీఐ(ఎం) గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా మోకు ఇంద్రం, సోషల్ మీడియా ఇంచార్జి భూలక్ష్మీ నర్సింగరావును ఎన్నుకున్నారు. ఈ మహాసభలో మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, మండల కమిటీ సభ్యులు గొర్రె శ్రీనివాస్, ఎన్. కనకయ్య, బోయిని మల్లేశం, దండ్ల రమేష్, గంధాల బాలు, ఎస్టీ ఇస్మాయిల్, గర్నపెల్లి చంద్రం, జీడాల చంద్రయ్య, ఆవుల చంద్రయ్య, ముత్తగారి లక్ష్మయ్య, కుర్జకుంట కనకయ్య, ముత్తగారి శ్రీను, దేవులపల్లి రమేష్, దేవులపల్లి కృష్ణమూర్తి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి సీఎం పదవి నుంచి తప్పుకోవాలి

- 10 నెలలోనేరూ. 90 వేల కోట్ల అప్పులు.
- మూసి నదికి రూ.1,50 వేల కోట్లు దోచుకునేందుకా.?
- ఎఫ్ డి సి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

సీఎం రేవంత్ రెడ్డి కి పరిపాలన అవగాహన లేదని అసలు చేతకాదని వెంటనే ఆ పదవి నుంచి తప్పుకోవాలని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో గురువారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలో రూ.90 వేల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో మూసీ నదికి రూ.16 వేల కోట్లు ప్రతిపాదించగా మూసీ నది ప్రజలు ఇతర ప్రాంతంలో జీవించలేమని ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా కేసీఆర్ దాని విరమించారని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి మూసీ నదికి రూ 1.5లక్షల కోట్లు ఎవరి జేబు నింపేందుకని ప్రతిపాదించినట్లు అని ప్రశ్నించారు. పేదలు నివసిస్తున్న మూసీ నది ఒడ్డున వారి ఇల్లు కూల్చివేసి వారిని రోడ్డుపాలు చేస్తున్నారన్నారు. పరిపాలన చేతగాని రేవంత్ రెడ్డి హైదరాబాదు ప్రజలను నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా పెట్టుకొని నోటీసులు ఇవ్వకుండా పైసా పైసా కూడబెట్టుకుని పేదలు ఇల్లు నిర్మించుకుంటే ఆ గూడును కూల్చుతున్నారని రేవంత్ రెడ్డి కుర్చీ కూడా కూలుతుందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండలం అధ్యక్షులు బెండ మధు, మాజీ జెడ్పీటీసీ మల్లేశం, కౌన్సిల్ సభ్యులు రజిత గౌడ్, గుంటుకు శిరీష రాజు, అర్చన శివకుమార్, పార్టీ సీనియర్లు శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య



నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందుబాటులో ఉందని మండల విద్యాధికారి ప్రవీణ్ బాబు పేర్కొన్నార్ను మండల వనరుల కేంద్రానికి ఈ విద్యా సంవత్సరంకు 21 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పార్ట్ -2 పాఠ్యపుస్తకాలు గురువారం చేరుకున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఏ-1 పరీక్షలు అనంతరం విద్యార్థులకు పార్టీ పుస్తకాలను అందజేస్తామన్నారు. మారుతున్న కాలాన్ని అనుగుణంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కిష్టయ్య, మతిన్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జంగం రాజలింగం, జిల్లా కార్యదర్శి రెడ్డి ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు స్థానిక రియల్ ఎస్టేట్ కార్యాలయం లో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల ముందు చెప్పిన మాటలు మర్చిపోయి, రేవంత్ రెడ్డి ఎల్ఆర్ఎస్ తో రాష్ట్ర ఖజానా నింపడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటికైనా గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఫ్రీగా రెగ్యులర్ చేయాలని, భూముల విలువలను పెంచకూడదని, ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతంత మాత్రం కొనసాగుతుండగా, మునిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగా భూముల విలువను పెంచి వ్యాపారాన్ని మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1 నుంచి భూముల విలువ పెంచాలని నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమైతామని హెచ్చరించారు. ఒక పక్క హైడ్రాతో హైదరాబాదు పరిధిలో వ్యాపారం మరింత దిగజారి పోగా, మరో పక్క జిల్లాలలో ఎల్ఆర్ఎస్ భూముల విలువ పెంపుతో కుంటూ పడిపోయిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంపై పరోక్షంగా ప్రత్యక్షంగా 50 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో అంతా రోడ్డున పడే ప్రమాదముందని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సంజీవ్, మల్లారెడ్డి, భగవాన్ రెడ్డి, రంగయ్య, సంజీవ్, శ్రీనివాస్, దేవేందర్ గౌడ్, చిన్నగౌడ్, శ్రీరామ్, సురేందర్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆన్ లైన్ బెట్టింగ్‌కు యువ వ్యాపారి ఆత్మహత్య



నవతెలంగాణ-మిరుదొడ్డి

ఆన్ లైన్ బెట్టింగ్‌కు పాల్పడిన యువ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై పరుశరాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈ దారి నవీన్ (27) వ్యవసాయ సంబంధిత ఎరువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సులభంగా ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ఆన్ లైన్ బెట్టింగుకు పాల్పడ్డాడు. బెట్టింగులకు బానిసైన నవీన్ అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. అప్పులు తీర్చే మార్గం కానరాకపో వడంతో తీవ్ర మనస్థాపానికి గురైన నవీన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నంకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుం డగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాధిక, ఒక కుమా రుడు(2) ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. శవ పరీక్ష నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తరలించా మన్నారు.

సభ్యత్వం బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ-తొగుట

మండల కేంద్రంలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో బీఆర్ఎస్ కార్య కర్త చింత నర్సింహులు మృతి చెందాడు. ఈ మేరకు బీఆర్ఎస్ క్రియాశీలక సభ్యత్వం బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆదేశం మేరకు మృతుని భార్య పద్మకు మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి గురువారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అలు పెరుగని పోరాటం ద్వారా తెలంగాణను సాధించు కోవడంతో పాటు తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణ అభి వృద్ధి సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీ సీ సుతారి రమేష్, మాజీ మండల అధ్యక్షులు చిలువేరి మ ల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు దోమల కొమురయ్య, బక్క కనకయ్య, సొసైటీ వైస్ చైర్మెన్ కుర్మ యాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కంది రాంరెడ్డి, నాయ కులు మంగ నర్సింహులు, పరమేశ్వర్ రెడ్డి, రామెల్ల అనిల్, బోయిని శ్రీని వాస్, నరేందర్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, భాస్కర్ గౌడ్, డీలర్ వెంకట్ రెడ్డి, పబ్బతి వెంకట్ రెడ్డి, పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకరణానికి హజరైన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

గజ్వేల్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి గురువారం మర్కుక్ కాంగ్రెస్ నాయకులు భారిగా తరలారు. కాంగ్రెస్ మర్కుక్ మండల అధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు గుర్రాల నర్సింలు, పాతూరు మాజీ సర్పంచ్ అరుణ నర్సింలు, పాతూరు కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు నర్సింలు, నాయకులు నాగిరెడ్డి, హన్మంత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

వార్డుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పర్యటన



నవతెలంగాణ-సిద్దిపేట

బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని ఎర్ర చెరువు ,కోమటి చెరువు, కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలలో మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు గురువారం పర్యటించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. లైటింగ్ లేని ప్రదేశాలలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. గుంతలల్లో మట్టిని (మొరం) పోసి చదును చేయాలని, అవసరమగు వార్డులలో, చెరువు కట్టలపై త్రాగునీటి వసతిని కూడా కల్పించాలని సూచించారు. కేసీఆర్ నగర్‌లోని యూజీడీ సమస్యను తొందరగా పరిష్కరి ంచాల్సిందిగా సూచించారు. పండుగలు వస్తున్న సందర్భంగా అధికారులెవ్వరు నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని సూచించారు. పట్టణంలోని చెరువుల వద్ద గజ ఈతగాళ్ళు అందుబాటులో ఉండాలని, ఎవరు కూడా బతుకమ్మలను లోతులోకి వెళ్లి వేయారదని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ధర్మవరం బ్రహ్మం, బర్ల మల్లికార్జున్, సాయన్న గారి సుందర్, మాజీ మున్సిపల్ చైర్మెన్ కడవేరుగు రాజనర్సు, డీ. ఈ. ప్రేరణ, ఏ.ఈ. పృథ్వి సానిటరీ ఇన్స్పెక్టర్ సతీష్, వనిత, మాధవి, నాయకులు బంధారం రాజు, గాదగోని సత్యం గౌడ్ పాల్గొన్నారు.

అపోలో కాలేజీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక అపోలో వొకేషనల్ జూనియర్ కాలేజీ లో బతుకమ్మ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి . విద్యార్థులు అందరు సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చి బతుకమ్మని అందంగా పేర్చి ఆటపా టల తో...సంబరంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేముల గణేష్ మాట్లాడుతూ.. ప్రకృతినే ఆరాదిస్తు పూలనే ఓక పండగలా చేసుకోవడం విశేషం అన్నారు. రాష్ట్రం లో మాత్రమే బతుకమ్మ పండగ ఉంటుందనీ..చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ చేసుకొనే పండగ అని చెప్పారు .ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం రాజేంద్ర ప్రసాద్, సమత, మనుష, జ్యోతి, సుజాతరాణి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ దేవాలయాన్ని సందర్శించిన కొమ్మూరి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం నాగపురి శివారులో గల నల్ల పోచమ్మ దేవాలయాన్ని గురువారం జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ మరమ్మతుల గూర్చి దేవాలయ కమిటీని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. దేవాలయానికి వెళ్ళడానికి రోడ్డు, దేవాలయం చుట్టూ సిమెంటుతో బెడ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ చైర్మెన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొమ్ము రవి, శ్రీ నల్లపోచమ్మ దేవాలయ చైర్మెన్ గూడెం మహేష్ పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా పండుగకు గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

- సీపీఐ(ఎం) మండల నాయకులు తేలు ఇస్తారి



నవతెలంగాణ-కొమురవెల్లి

బతుకమ్మ పండుగకు ఐనాపూర్ గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణకు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో తేలు ఇస్తారి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు గ్రామ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారని, గ్రామంలో కనీసం వీధిలైట్లు ఏర్పాటు చేయలేదని , విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేక గ్రామంలో ప్రజలు చిమ్మ చీకట్లో ఉంటున్నారని మండిపడ్డారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే ప్రభుత్వము నుంచి నిధులు రాక ఇబ్బందులు పడుతున్నామని సమాధానమిచ్చాడని తెలిపారు. వెంటనే బతుకమ్మ , దసరా పండుగకు గ్రామంలో ఏర్పాట్లకు చర్యలు చేపట్టి, వార్డుల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడుతామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సున్నం యాదగిరి, సుక్క ఎల్లయ్య, పాశం చంద్రయ్య, రాములు, ఎండి గోరెమియా పాల్గొన్నారు

పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయి

- సీపీ. డాక్టర్ బి. అనురాధ



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ సిఏఆర్ హెడ్ క్వార్టర్ లో ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లగా విధులు నిర్వహిస్తున్న వై. కృష్ణారెడ్డి, జే. లక్ష్మీనారాయణ, ఎన్. శ్రీనివాస్ లు ఏఆర్ ఎస్ఐ లుగా పదోన్నతి పొందిన గురువారం మర్యాద పూర్వకంగా సీపీని కలసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ ఆమె చేతులమీదుగా అధికారుల భుజాలపై ఏఆర్ఎస్ఐ చిన్నహం అయిన ఒక నక్షత్రాలను అలంకరించడంతో పాటు పదోన్నతి పొందిన అధికారులను అభినందించారు.

సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-కొండపాక

ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను కుకునూరుపల్లి మండల పరిధిలోని ముద్దాపూర్ గ్రామంలో కుటుంబాల సర్వే చేస్తున్న కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్న విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డి ఉన్నారు

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన చైర్ పర్సన్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలోని 2వ వార్డులో 15, 16వ ఫైనాన్స్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆ వార్డు కౌన్సిలర్ చెవిటి లింగంతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎస్.నాగేందర్, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ముస్త్యాల తార-యాదగిరి, పచ్చిమడ్ల సతీష్ గౌడ్, కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ చైర్మెన్ ముస్త్యాల కిష్టయ్య మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, నాయకులు కాటం శ్రీనివాస్, పచ్చిమడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఎఫ్‌డీసీ సర్వే ప్రారంభం




నవతెలంగాణ-గజ్వేల్

గురువారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కలెక్టర్ కార్యాలయం నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పైలట్ ప్రాజెక్టు క్రింద 17వ వార్డ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ఎన్‌సి రాజమౌళి గుప్తా17 వ వార్డ్ లోని ముట్రాజ్ పల్లిలో ప్రారంభించి, సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య స్థానిక కౌన్సిలర్, దుంబాల లక్ష్మీ కిషన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు ఆర్పీలు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మండల పరిధిలోని హాసన్ మీరాపూర్ గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే నేటి నుంచి ఐదు రోజుల పాటు కొనసాగుతుందని ఎంపీడీఓ భాస్కర్ శర్మ అన్నారు. ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ భాగంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేకు హాసన్ మీరాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసిన సందర్భంగా గురువారం జిల్లా కలెక్ట ఆదేశాల మేరకు మిరుదొడ్డి తహసీల్దార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శిలతో కలిసి ఇంటింటా తిరుగుతూ సర్వే చేపట్టానున్నారు. వ్యవసాయ పనులు కోసం బావుల దగ్గరకు వెళ్లినవారు, కూలీ పనుల కోసం సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలతో పాటు దూరపు ప్రాంతాల్లో ఉన్నవారి వివరాలు సేకరించలేదని, ఈ విషయంలో గ్రామస్తులు కంగారు పడవద్దని నేటి నుంచి 5 రోజులు సర్వే ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సర్వేకు వచ్చే అధికారులకు వివరాలు అందించి సహకరించాలని కోరారు.



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని నాగరాజుపల్లి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ) సర్వే ప్రారంభించారు. తహసీల్దార్ , ఎంపీడీవో, ఎంపీఓలతో కలిసి ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే చేసినట్లు వారు వివరించారు. ఈ సర్వే నిర్వహణకు వచ్చిన బృందాలకు ప్రజలు వారి కుటుంబాలకు సంబంధించిన అన్ని వివరాలు అధికారులకు సమగ్రంగా అందజేయాలని చెప్పారు. ఏ ప్రాతిపదికన గ్రామాన్ని ఎంపిక చేశారంటూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తప్పెట శంకర్ సర్వే అధికారులను నిలదీశారు. బీఆర్ఎస్ నాయకులు చెబితేనే పనులు చేస్తారా అంటూ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ప్రశ్నించారు.

తుమ్మలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం గజ్వేల్ పర్యటనలో భాగంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు గజ్వేల్లో ఆయనను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం హాజరు కావడానికి వచ్చిన మంత్రికి ఘన స్వాగతం పలికారు. పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షులు మద్దూరి మల్లారెడ్డి, ములుగు అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, నాయకులు గోపాల్ రావు, మైనార్టీ బాబా తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించారు. గతంలో నాయిని యాదగిరి తో మంత్రి తుమ్మల కున్న పరిచయాలను నెమరు వేసుకున్నట్లు సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గజ్వేల్ లో కాంగ్రెస్ బలోపేతానికి అందరూ కృషి చేయాలని మంత్రి వారిని కోరారు.

మన కోసం పనిచేసే వారినే ఎన్నుకుందాం

- నిరుద్యోగ యూత్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ రామకృష్ణ ప్రభు



నవతెలంగాణ -దుబ్బాక

త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్ర నిరుద్యోగులు మేల్కొని మన బాగుకోసం పనిచేసే వారినే ఎన్నుకుందామని తెలంగాణ నిరుద్యోగ యూత్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ రామకృష్ణ ప్రభు కోరారు. దుబ్బాక మున్సిపల్ కేంద్రంలో గురువారం అయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు దక్కేలా కృషి చేస్తామని, ప్రయివేటు రంగాల్లో ఉపాధి అవకాశాల్ని కల్పిస్తామంటూ మాయ మాటలు చెప్తూ గెలిచిన వారందరూ పట్టభద్ర నిరుద్యోగులకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ పట్టబద్రులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తూ.. ప్రభుత్వాలతో కొట్లాడే వారినే ఎన్నుకుందామని విజ్ఞప్తి చేశారు.

బతుకమ్మ సంబరాలకు పాండవుల చెరువు ముస్తాబ్





నవతెలంగాణ-గజ్వేల్

బతుకమ్మ సంబరాలకు పాండవుల చెరువు ముస్తాబ్ చేస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళలు, చిన్నారులు పాండవుల చెరువుకు వస్తున్న క్రమంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్ట్రీట్ లైట్లు బిగింపు చేశారు, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య పాండవుల చెరువు మరమ్మతులు చేపట్టారు. రెండు మూడు రోజులుగా చెరువుల వద్ద మరమతులు చేపడుతున్నారు. రాత్రి వేళలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జనరేటర్ కూడా ఏర్పాటు చేయాలని మున్సిపల్ పాలకవర్గం నిర్ణయించింది. పోలీస్ బందోబస్తు, మున్సిపల్ సిబ్బంది చెరువుల వద్ద బతుకమ్మల స్వీకరించి నిమజ్జనం చేస్తారు. మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, వైస్ చైర్మన్ జకీర్, కమిషనర్ గోల్కొండ నరసయ్య, కౌన్సిల్ సభ్యులు పాండవుల చెరువును, ఊర చెరువులను పరిశీలించి పలు సూచన సలహాలు ఇచ్చారు.

ఘనంగా అమ్మవారికి స్వాగతం



నవతెలంగాణ-చేర్యాల

శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవిస్నేహ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా అమ్మవారికి స్వాగతం పలికారు. చేర్యాల పట్టణంలోని చావడి వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో ప్రతిష్ఠాపనకు అమ్మవారిని పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా డప్పు చప్పుళ్ళతో భారీ కార్ల ర్యాలీతో అమ్మవారిని ఊరేగింపుగా స్టేజీ వద్దకు తీసుకొనివచ్చి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కాంగ్రెస్ సర్కార్ అన్నింటా "అట్టర్ ఫ్లాప్"

- మంత్రులకు పని చేయించే సత్తా లేదు
- అధికారంలో ఉన్న మీరు అడ్డుకోవడం ఏంటి..?
- పండగలకు పైసల్లేవు అంటున్నారు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి





నవతెలంగాణ- దుబ్బాక

"రాష్ట్రంలో విచిత్రమైన పాలన నడుస్తోంది.ఎక్కడైనా అధికార పార్టీ మంత్రుల్ని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నాయకులు అడ్డుకుంటారు. కానీ రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులే ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ఏంటి?, కాంగ్రెస్ మంత్రులు,నాయకులకు తాము అధికారంలో ఉన్నామా.? ప్రతిపక్షంలో ఉన్నామా.? అన్న కనీస స్పృహ లేకుండా ఉన్నారు. బతుకమ్మ సంబరాలు, రోడ్ల మరమ్మతులకు పైసల్లేవని అంటున్నారు. మంత్రుల మాట అధికారులు వింటలేరు. మంత్రులకు పని చేయించే సత్తా లేదు. ఈ 9 నెలల పాలనలో కాంగ్రెస్ సర్కార్ అన్నింటా అట్టర్ ఫ్లాప్ అయ్యింది."అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంత్రి సురేఖపై అవమానకర సోషల్ మీడియా ప్రచారాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నాని.. మహిళలను అగౌరవపరిచే సంస్కృతి బీఆర్ఎస్‌కి లేదని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ గురువారం చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కౌన్సిల్ సమావేశానికి 'ఎక్స్ అఫీషియో మెంబర్' హోదాలో ఎమ్మెల్యే హాజరయ్యారు. 13 ఎజెండా అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. గతంలో పనిచేసిన పారిశుధ్య కార్మికులకు పెండింగ్ లో ఉన్న జీతాల్లో కొంతమేర ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ లోని అన్ని వార్డుల్లో బతుకమ్మ సంబరాలకు సంబంధించిన ఏర్పాటు చేయాలని, ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్లు పార్టీలకతీతంగా కలిసికట్టుగా ఉంటూ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆ తర్వాత మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మంత్రి సురేఖ కనీస విలువల్ని పాటించకుండా మాట్లాడుతుందన్నారు. అధికారంలో ఉన్నది మీరే కదా..మంత్రిని అగౌరపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు చేసిన వారిని పట్టుకొని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సూచించారు.

హామీలు మరిచి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్రు..

కాంగ్రెస్ సర్కార్ కు పరిపాలన చేతకాక,ఇచ్చిన హామీలను మరిచి డైవర్షన్ రాజకీయాలు మొదలెట్టారని.. అందులో భాగంగానే హైడ్రా,మూసి ప్రక్షాళన,సినీ నటులపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.అధికారంలో ఉండి జవాబుదారితనం మర్చిపోయారని.. ప్రతిపక్ష నాయకుల వలే నిరసన తెలుపుతూ,ప్రశ్నించడం లాంటి విచిత్ర సంస్కృతికి కాంగ్రెస్ నాయకులు తెరలేపుతున్నారని ఎద్దేవా చేశారు.

మంత్రులకు పని చేయించే సత్తలేదు..

కాంగ్రెస్ మంత్రులకు పని చేయించే సత్తా లేదన్నారు. మంత్రుల మాటలు అధికారులు వినడం లేదని ఎద్దేవా చేశారు. జిల్లా ఇన్చార్జి మంత్రులకు జిల్లా సమస్యలు ఎరిగి ఉండాలని..జిల్లాకు ఏం పనులు కావాలి..?ఏం నిధులు విడుదల చేయాలి? అన్న కనీస బాధ్యత లేదని విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో రోడ్లు సరిగా లేవని,పంచాయతీ,ఆర్అండ్ బీ, విద్యుత్తు శాఖల్లో నెలకొన్న మరమ్మత్తుల కోసం జిల్లా కలెక్టర్ ను నిధులు మంజూరు చేయాలని తానే స్వయంగా కోరినా.. డబ్బులు లేవంటూ సమాధానం చెప్పడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్, కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పలువురున్నారు.

లైంగిక దాడి నిందితునికి కఠిన శిక్షపడేలా చేస్తా

-ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



నవతెలంగాణ - కొమురవెల్లి

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితునికి కఠిన శిక్షపడేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చేస్తానని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య గురువారం అన్నారు. ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేష్, మాజీ జెడ్పి చైర్ పర్సన్ తుల ఉమతో కలిసి గురువన్నపేట గ్రామంలో బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.లైంగిక దాడి ఘటనపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విచారం వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, నిందితుడికి తక్షణమే శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు విచారణ చేసి మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేస్తూ, అమ్మాయి చదువు తో పాటు అన్ని విధాల కుర్మ సంఘం, ప్రభుత్వం చూసుకుంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలో 15 మందిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని సిద్దిపేట సీపీని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ షెఫర్డ్ ప్రెసిడెంట్ బురుగడ్డ పుష్ప నాగేష్, సిద్దిపేట జిల్లా కురుమ సంఘం అద్యక్షులు కోరే ఎల్లయ్య జనగామ జిల్లా అద్యక్షులు కంచే రాములు, రాష్ట్ర నాయకులు సూర్ణ శ్రీశైలం, అందే నాని బాబు, కందూరి ఐలయ్య, మీస సత్యనారాయణ, అందే అశోక్, ఎమ్మె మహేందర్, కురుమ శ్రీశైలం, జంగిలి యాదగిరి, మేక సంతోష్, అందె బీరయ్య, బండారి కనకయ్య, ఈరి భూమయ్య, తదితరులు పాల్గోన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ సర్కార్

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి





నవతెలంగాణ-కొమురవెల్లి

పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. కొముంవెల్లి గ్రామ సీపీఐ(ఎం) శాఖ మహాసభ గురువారం జరిగింది. ఈ మేరకు మహాసభ సూచికగా సీపీఐ(ఎం) పార్టీ జెండాను మల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం శాఖ మహాసభకు సార్ల యాదయ్య, అరుట్ల దయానంద్ ల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. సిస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి జన్ దన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న మోడీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వ బ్యాంకులకు కుచ్చుటోపి పెట్టి దేశం నుంచి అనేక మంది పెద్దలు పారిపోయారని వారిపై నేటికీ చర్యలు లేవన్నారు. ధరలు అరికట్టడంలో కేంద్రం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. మోడీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. దేశంలో పేద ప్రజలకు ఉండడానికి ఇల్లు లేక చేతినిండా పనులు దొరకక అద్దె ఇళ్లల్లో ఉంటూ అనేక ఇబ్బందులు భరిస్తున్నరన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తుందని, రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించకుండా అన్ని వర్గాలను మోసం చేస్తుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి పాలన కొనసాగిస్తూ జెమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసే పద్ధతి తీవ్రతరం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తున్నప్పటికీ రైతులకు రెండు లక్షల వరకు బ్యాంకు రుణ మాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని, వెంటనే రైతుబంధు డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు.

-సీపీఐ(ఎం) పార్టీలో చేరిక

ఈ మహాసభ సందర్భంగా బీఆర్ఎస్ నుంచి మాత్య సంస్థ అయిన సీపీఐ(ఎం) పార్టీలోకి మేకల కృపాకర్ చేరారు. ఆయనకు కండువా కప్పి మల్లారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ శాఖ మహాసభ కొమురవెల్లి గ్రామ నూతన కార్యదర్శిగా సార్ల యాదయ్య, టెంపుల్ కార్యదర్శిగా అరుట్ల రవీందర్‌ను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సోషల్ మీడియా కొమురవెల్లి గ్రామ కన్వీనర్‌గా ఆరుట్ల దయానందను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, తాడూరి రవీందర్, అరుణ్ కుమార్, మండల నాయకులు తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు, తాడూరి మల్లేశం, ధ్యాపజ్యోతి, లింగంపల్లి మల్లయ్య, సార్ల నరసింహులు, పుట్ట అంజయ్య, కొండ జనార్ధన్, నవీన్, రాజేశ్వర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆసరా సీఎం సహాయ నిధి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అనారోగ్యంతో బాధపడినప్పుడు కార్పొరేట్ ప్రయివేట్ ఆస్పత్రుల్లో కూడా వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయని చెక్కులు పంపిణీ గురువారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దౌల్తాబాద్ మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చిదుగు పోచమ్మకు రూ.12 వేల సీఎం సహాయనిధి చెక్కును అందజేయడం జరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యానికి గురై ప్రాణాలను పోగొట్టుకోవద్దన్న సంకల్పంతో వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆదుకోవడం కోసం సీఎం సహాయనిధి చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రహీముద్దీన్, మాజీ వైస్ ఎంపీపీ అల్లిశేఖర్ రెడ్డి, నాయకులు రాజలింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను రక్షించేందుకు కృషి

- జిల్లా అటవీ అధికారి (డిఎఫ్ఓ) కొత్తపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజల సహకారంతో వన్యప్రానులను రక్షించుకనేందుకు అటవీ శాఖ అధికారులు, ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని జిల్లా అటవీ అధికారి కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. 70వ వన్య ప్రాణ రక్షణ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలలోవిద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్ రెడ్డిలు హాజరై మాట్లాడారు. అడవిలో 8 శాతం జీవవైవిధ్యం కోసం కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రకృతి సమతుల్యతను కాపాడు కోకుంటే భవిష్యత్తులో జీవ విధ్వంసం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ప్రకృతి సమతుల్యతను రక్షించాలన్నారు. విద్యార్థులు మొక్కలు, వణ్య ప్రాణుల ప్రాధాన్యతను తెలుసుకొని వాటి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్స్ సత్యనారాయణ రెడ్డి, రాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విక్రముద్దీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ధరపల్లి నగేష్, అధ్యాపకులు కనక చంద్రం, వనజా రెడ్డి, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రాజ్యలక్ష్మి, రమా, రఘురాజ్, గంగాధర్, శనిగరం శ్రీనివాస్, లక్ష్మి ప్రసాద్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసిన ప్రోగ్రాం ఆఫీసర్



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బద్దిపడగ ఆరోగ్య ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంను ప్రోగ్రాం ఆఫీసర్, ఎంహెచ్ఎన్ డాక్టర్ ఆనంద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సిబ్బంది హాజరుతీరును, వారు అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఆరోగ్య సేవలైన గర్భిణీ నమోదు, ప్రసూతి సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అసంక్రమిక వ్యాధుల నివారణ కార్యక్రమాలు వందశాతం నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో ఉపకేంద్ర సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాలను తనిఖీ చేస్తూ అవసరమైన వారికి చికిత్సను అందించాలని అవసరమైన పక్షంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీ సెంటర్, పాఠశాలల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పైన అవగాహన కలిగించాలని ఆదేశించారు. సమయపాలన ప్రకారం సేవలు అందించాలని లేనిచో తగిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.ఈ తనిఖీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అంజలి, పీహెచ్ఎన్ జయ, ఎపిడమాలాజిస్ట్ సోఫాన్, ఆరోగ్య ఉప కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరుగా చికిత్స పొందుతూ ఇద్దరు మహిళలు మృతి



ఫైల్

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అతివేగం, అజాగ్రత్తతో ద్విచక్ర వాహనాన్ని నడపడం వల్ల రోడ్డు ప్రమాదం సంభవించి మహిళకు తీవ్ర గాయలైన సంఘటన అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డి పేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. అక్బర్ పేట భూంపల్లి ఎస్ఐ హరీష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25న మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన గాద లక్ష్మీ (40)తన పెద్దకొడుకు రాముతో కలిసి బైక్ పై కల్వకుంటలో తన బంధువుల ఇంటికి బయలుదేరారు. రాము అతివేగంగా, అజాగ్రత్తతో బైక్ నడపడం వల్ల పోతారెడ్డి పేట గ్రామ శివారులోకి ప్రమాదవాశాత్తు లక్ష్మి కింద పడటంతో ముఖానికి తీవ్ర గాయాలపాలైంది. చికిత్స కోసం సిద్దిపేటలోని లోహిత్ సాయి ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స అదే నెల 28న గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు కాగా రెండు సంవత్సరాల క్రితం మృతురాలి భర్త నర్సింలు అనారోగ్య సమస్యలతో చనిపోయాడు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారభించినట్లు ఎస్ఐ తెలిపారు

నవతెలంగాణ-బెజ్జంకి

పురుగుమందు సేవించి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గుగ్గిల్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతురాలి భర్త వివరాల మేరకు బానాల కనుకవ్వ గత ఐదేళ్ల క్రితం శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కడుపు నొప్పి వస్తుందంటూ చెప్పుండడంతో..మనస్థాపానికి గురై బుధవారం స్వంత ఇంట్లో పురుగుమందు సేవించింది. గమనించిన భర్త చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూపరిస్థితి విషమించి మహిళ మృతి చెందింది. మృతరాలి భర్త బానాల సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రిష్ణా రెడ్డి తెలిపారు.

బహుజన బతుకమ్మను విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-రాయపోల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో ఈ నెల 9 న జరిగే బహుజన బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు స్వామి అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో బహుజన బతుకమ్మ గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును చాటిచెబుతూ బహుజన బతుకమ్మను కామ్రేడ్ విమలక్క బహుజన బతుకమ్మ నిర్మాణ కమిటీ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బహుజన బతుకమ్మ ప్రారంభించడం జరిగిందన్నారు. అందుకే చైతన్యయుతమైన తెలంగాణ సమాజం వివక్ష నుంచి స్త్రీలను, పర్యావరణ విధ్వంసం నుంచి రక్షించడానికి సాగుతున్న బహుజన బతుకమ్మ ఉద్యమంలో భాగం కావాలని పిలుపునిస్తున్నాం. ఇప్పటికే 2010లోనే తెలంగాణ బిల్లు పెట్టాలనే అంశంతో మొదలై వనరుల విధ్వంసాన్ని, చెరువులు- కుంటలు, మద్యం- మత్తును, అంటరానితనాన్ని, యురేనియంతవ్వకాలను, ప్రకృతి వ్యవసాయాన్ని, ఎత్తి పడుతూ వచ్చింది బహుజన బతుకమ్మ. ఈసారి స్త్రీలపై లైంగిక అత్యాచారాలకు నిరసనగా "గుండెలు బాదుకోకమ్మ- గుతుప్పలందుకోవమ్మ"బహుజన బతుకమ్మ అంటే పూల కవాతు-స్త్రీల కవాతు"అంటూ పిలుపునిస్తుంది.ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు స్వామి, బాలన్న,మల్లేశం, సాయిలు, నగేష్, మహేందర్, మల్లేశం పాల్గొన్నారు.

దేవి శరన్నవరాత్రులకు అంకురార్పణ



నవతెలంగాణ-వర్గల్

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్ర శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా గురువారం ఆలయ వ్యవస్థాపక చైర్మెన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనము, మహాభిషేకము, కలశస్థాపన, చతుష్షష్ఠ్య పచార పూజలు, మూలమంత్ర హవనము, చండీహెూమము తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినాలను పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ శనైశ్చర, శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర , శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి క్షేత్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. కాగా ఈరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.